TGTEL/25/A4103

# తెలంగాణవీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




హైదరాబాద్ ఎడిటర్ : కె. శ్రీనివాస్ సంపుటి:01 సంచిక:268 08 శుక్రవారం అక్టోబర్ 2026 పేజీలు : 08 వెల: రూ. 3/-



## యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

ప్రపంచ సంస్థలకు

హైదరాబాద్ గమ్యస్థానం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్య స్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు.

# కోట్లాది మంది విశ్వాసమే నా అతిపెద్ద బలం



- నాపై దేశ ప్రజలకే ఎక్కువ హక్కు ఉంది
- దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి
- విఘ్నహర్త ఆశీస్సులతో దేశం ప్రగతిపథంలో సాగాలి
- 25 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

సీఎం, పీఎంగా 25 ఏళ్ల అధికార ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ తన రాజకీయ జీవితం, వ్యక్తిగత అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, తన జీవితంలోని ప్రతి క్షణం, ప్రతి సంఘటన తనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పించాయని తెలిపారు. సాధించిన ప్రతి విజయం తనను మరింత ఉన్నత లక్ష్యాల వైపు నడిపించిందని అన్నారు.ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది.

## రసాయన శాస్త్రంలో హెన్రీ కాగన్, కెన్సో సోయికి నోబెల్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

వైద్యశాస్త్రంలో చేసిన సేవలకుగానూ 2026 సంవత్సరానికి నోబెల్ బహుమతి ముగ్గురు శాస్త్రవేత్తలను వరించింది. సైంటిస్టులు కార్ల్ డిస్సెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్‌లకు అత్యున్నత పురస్కారం నోబెల్ లభించింది. కాంతి- నియంత్రిత అయాన్ ఛానెల్స్, ఆప్టోజెనెటిక్స్ పై వారి ఆవిష్కరణలకు ఈ అవార్డు అందుకుంటున్నారు. సజీవ మెదడులోని నాడుల కణాలు (న్యూరాన్లు) మన జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనను ఎలా ప్రభావితం చేస్తాయో చూపించడం వీరు చేసిన ప్రయోగం ద్వారా సాధ్యమైంది. పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్ ఒక ఏకకణ నాచు (శైవలం)లో ఛానెల్ రోడాప్సిన్ అనే అద్భుతమైన ప్రోటీన్ ఉన్నట్లు కనుగొన్నారు. కార్ల్ డిస్సెరోత్ ఈ ప్రోటీన్‌ను నరాల కణాల కోసం కాంతితో నియంత్రించగలిగే ఒక 'స్విచ్' విధానం తీసుకొచ్చారు. ప్రముఖ శాస్త్రవేత్త జార్జ్ నాగెల్ 1953లో జన్మించారు. ఆయన 1988లో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.




# బీజేపీని దేశ ప్రజలు క్షమించరు

## పోరాటం ఆపేది లేదు



- మోదీ, అమిత్ షా నిరంకుశత్వం
- ప్రజాస్వామ్యయుత ఆందోళనకు అడ్డు
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో వైదొలగాలి
- ప్రధాని మోదీ రాజీనామా చేయించాలి
- ఢిల్లీ పోలీసులపై సీఎం రేవంత్ ఆగ్రహం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి ముఖ్య నాయకులను ఢిల్లీ పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బారాఖంబ పోలీస్ స్టేషన్‌లో ఉన్న రాహుల్ గాంధీని కలిసేందుకు వెళ్లిన తనను కూడా పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. ఓటు హక్కును హరిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తే దేశ ప్రజలు బీజేపీని ఏమాత్రం క్షమించరని ఘాటుగా హెచ్చరించారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ పార్టీకి సంబంధించినది కాదని, యావత్ దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసమని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. అక్రమ నిర్బంధాలు, పోలీసుల దౌర్జన్యాలతో కాంగ్రెస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయలేరని, లాఠీలు, అరెస్టులతో పోరాటాలను ఆపడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు.ఓట్ల తొలగింపు వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరు అత్యంత వివాదాస్పదంగా మారిందని, నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమైన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర పాలకుల్లో పెరిగిపోతున్న అసహనానికి ఈ అక్రమ అరెస్టులే నిదర్శనమని, ప్రజల హక్కులను కాపాడే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు రాహుల్‌గాంధీకి మద్దతుగా దీక్ష చేపడతానన్న కాంగ్రెస్ పార్టీ నేత జగ్గారెడ్డి తెలిపారు. బీజేపీ, ఈసీకి వ్యతిరేకంగా రాహుల్ పోరాటం చేస్తున్నారన్న జగ్గారెడ్డి రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ ఎన్ని రోజులు పోరాటం చేస్తే అన్ని రోజులు దీక్ష చేపడతాని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# యాసంగిలో వరి బదులు ఆరుతడి పంటలే మేలు

- భూగర్భ జలాలను బట్టే పంట ఎంపిక
- వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సూచన
- వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష
- విత్తనాలు, ఎరువుల సరఫరాపై పలు సూచనలు

**హైదరాబాద్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాలు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నందున, రానున్న యాసంగిలో రైతులు వరికి బదులు తక్కువ నీటితో పండే పంటల వైపు మళ్లేలా చూడాలని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, ఐ.ఏ.ఎస్. జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రబీ 2026-27 కార్యాచరణ ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి లభ్యత తక్కువగా ఉండే పరిస్థితుల్లో వరి సాగు రైతులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలతో పాటు మంచి ఆదాయాన్నిచ్చే కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు.





# ఢిల్లీలో మరోసారి ఉద్రిక్త వాతావరణం

## నేలపై పడుకొని ప్రియాంక గాంధీ నిరసన

- దేశవ్యాప్తంగా 'సర్' ప్రకంపనలు..
- జంతర్‌మంతర్ వద్ద విపక్ష ఎంపీల ఆందోళన!
- రాహుల్, ప్రియాంక సహా విపక్ష ఎంపీలు అరెస్ట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

దిల్లీలో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విపక్ష ఎంపీల సమావేశం అనంతరం, ఈసీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రతిపక్ష ఎంపీలు సిద్ధంకావడంతో ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు.



## రెపో రేటు 5.50 శాతానికి పెంపు

- 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ
- ఆగస్టులో ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరిక
- ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో నిర్ణయం
- ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం!!
- 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చు
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి
- ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడం తప్పదు
- ఎస్‌బీఐ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి చేరింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతో పాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.75 శాతానికి చేరాయి.



# తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ
- 19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

తెలంగాణలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు చేరువైన డిమాండ్ ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించామని చెప్పారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు.

తీరడం లేదు.

# రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం

- ఏర్పడిన తీవ్ర కరువు పరిస్థితులు
- పూర్తిగా అడుగంటిన భూగర్భజలాలు
- నీరు లేక ఎండిపోతున్న బోరుబావులు
- రిజర్వాయర్లలో తగ్గిన నీటి మట్టాలు
- తాగునీటికి తీవ్ర ఇబ్బందులు తప్పవా?
- సాగునీరుపై రైతన్నల ఆశలు గల్లంతే!

**హైదరాబాద్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

రాష్ట్రంలో ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే వర్షాలు పడక నానా ఇబ్బందులకు దారి తీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మరోవైపు పూర్తిగా భూగర్భజలాలు అడుగంటాయి. నీరు లేక బోరుబావులు ఎండిపోతున్నాయి. రిజర్వాయర్లలో నీటి మట్టాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు సాగునీరు అందించడమనేది పెద్ద సవాలుగా మారనుంది. ఇక తాగు నీటి విషయంలో కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు కన్పిస్తున్నాయి. మరోవైపు కృష్ణమ్మ కరుణిస్తున్నా, గోదారి గొంతు తడుపుతున్నా హైదరాబాద్ మహానగరం దప్పిక



మొదటిపేజీ తరువాయి

## తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

కర్ణాటకలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని తెలిపారు. ఈ రాష్ట్రాల కంటే తెలంగాణలో విద్యుత్ వినియోగ డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాను కొనసాగించగలిగామని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ రంగంపై కొందరు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర విద్యుత్ సంస్థలను పబ్లిక్‌గా లిస్ట్ చేయడం లేదా వాటిని ప్రభుత్వ రంగం నుంచి తప్పించే ప్రతిపాదన కూడా లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నెహ్రూ అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రస్తావించిన భట్టి.. మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో పాటు బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు కాంగ్రెస్ విధానంలో కీలక భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత పటిష్ఠం చేస్తామని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

## రెపో రేటు 5.50 శాతానికి పెంపు

ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దీంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జులైలో ఇది 4.45 శాతంగా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపో రేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపో రేటు పెరగొచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మార్కెట్లలో మారుతున్న రిస్కుల నేపథ్యంలో ముందస్తు చర్య తీసుకోవడం మంచిదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావం, అక్టోబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కూడా రబీ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు తెలిపారు. మరోవైపు రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది. వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే. ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది.

మొదటిపేజీ తరువాయి

## యాసంగిలో వరి బదులు ఆరుతడి పంటలే మేలు

ప్రతి రైతూ తన ప్రాంతంలోని భూగర్భ జలాల లభ్యతను చూసుకున్న తరువాతే పంటను ఎంచుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్త ఈ యాసంగిలో ఎల్‌నినో వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వర్షపాత స్థితి, ఉష్ణోగ్రతల అంచనాలను అధికారులకు వివరించారు. కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ (క్రిడా) శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన చర్యలను వివరిస్తూ, భూగర్భ జలాల లభ్యత ఆధారంగానే పంటల ఎంపిక, సాగు జరగాలని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలమట్టాలను దృష్టిలో ఉంచుకుని వరికి బదులు ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. పప్పుధాన్య, నూనెగింజల, కూరగాయల పంటలకు అనువైన విత్తన కాలాలను కూడా వివరించారు. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు ఈ సీజన్‌లో రైతులు సాగు చేయడానికి అనువైన పంట రకాలను సిఫార్సు చేశారు. యాసంగి సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో, సరిపడా అందుబాటులో ఉండేలా సరఫరా పరిస్థితిని కూడా కమిషనర్ సమీక్షించారు. రాష్ట్రంలో 2025-26లో 26 జిల్లాల్లో నత్రజని,భాస్వరం ఎరువుల వినియోగ నిష్పత్తులు జాతీయ సగటు (9.7 : 3.7 : 1) కంటే అధికంగా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులు శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు మాత్రమే ఎరువులను వినియోగించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐ.ఏ.ఎస్. జిల్లా అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐ.ఏ.ఎస్., ఉద్యానవన శాఖ సంచాలకులు డాక్టర్ యాస్మీన్ బాషా, ఐ.ఏ.ఎస్. పాల్గొన్నారు. వీరితో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు; ఇక్రిశాట్, క్రిడా, ఐఎండీ, ఐఐఆర్ఆర్, ఐఐఎంఆర్, ఐఐఓఆర్ సంస్థల శాస్త్రవేత్తలు; ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయాలకు చెందిన శాస్త్రవేత్తలు జిల్లా వ్యవసాయ అధికారులు జిల్లా ఉద్యానవన అధికారులు మార్కెటింగ్ మరియు సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## ఢిల్లీలో మరోసారి ఉద్రిక్త వాతావరణం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తీరును ఖండిస్తూ, ఆయన రాజీనామా డిమాండ్‌తో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగారు.జంతర్ మంతర్ నిరసనలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు జ్ఞానేశ్ ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడితే తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని, వాటిని తాను మెడల్స్ భావిస్తానని తెలిపారు. ఇప్పటి వరకు తనపై 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని, 100 మెడల్స్ సాధించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈసీని కలుద్దామని 300 మంది వెళితే మాకు అనుమతి నిరాకరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదు. మా దృష్టిలో ఆయన చట్టబద్ధమైన అధికారి కాదు. దేశద్రోహులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సీఈసీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సహా విపక్ష ఎంపీలు బస్సుల్లో జంతర్‌మంతర్‌కు బయలుదేరగా, వారిని అడ్డుకోవడానికి వందలాది మంది భద్రతా బలగాలు మోహరించాయి. ఈ క్రమంలో జంతర్‌మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు.ఢిల్లీ పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "ఎంపీలతో ప్రవర్తించే తీరు ఇదేనా? ఎంపీలను కొడతారా? ఈడ్చి పడేస్తారా? ఈసీని కలుద్దామని ఎంపీలు అడగడం నేరమా?" అంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, విపక్ష ఎంపీలను పోలీసులు అరెస్టు చేశారు. మల్లికార్జున ఖర్గేమంగళవారం ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి అనుమతి లేకుండానే ప్రవేశించారనే ఆరోపణలపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ్య ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. 'మాపై ఎన్ని కేసులు పెట్టినా, ఎంతలా బెదిరించాలని చూసినా మేం భయపడేది లేదు. నవ్వుతూనే ముందుకెళ్తాం. ప్రజల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లాలనుకుంటున్నా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని, వారు గూండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతోందని మండిపడ్డారు. ఇదే అంశంపై స్పందించిన మరో కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా-శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం తమ ప్రజాస్వామ్య హక్కు అని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ని ప్రస్తావిస్తూ జంతర్ మంతర్ నిరసన ప్రదేశమైనప్పుడు అక్కడికి కూడా ఎంపీలను అనుమతించకపోతే ఎక్కడ ఆందోళన చేయాలని ప్రశ్నించారు. ఇక సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సహా కేంద్ర ప్రభుత్వంపైనా తమ పోరాటం కొనసాగుతుందని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా వ్యాఖ్యానించారు. వరుసగా రెండో రోజు ప్రతిపక్షాల ఆందోళనసర్ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆందోళన వరుసగా రెండో రోజు కొనసాగింది.

మొదటిపేజీ తరువాయి

## తెలంగాణకు బలం

జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు జరిగిన డిఇ షా షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా డిఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డిఇ షా ఒకటని శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. "సుమారు 20 మందితో ప్రారంభమైన డిఇ షా ఇండియా ప్రస్థానం ఇవ్వాళ హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగాల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి" అని మంత్రి తెలిపారు. మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందన్నారు. నగరం ఇప్పుడు ప్రపంచస్థాయి సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు. "హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో ఎంతో మారింది. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగింది. యువతలోని నైపుణ్యం, ప్రతిభే మన ప్రధాన బలం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సంస్థలు కేవలం తమ కార్యకలాపాలను నిర్వహించే ప్రదేశంగా కాకుండా.. కొత్త ఆవిష్కరణలు, అత్యున్నత విలువ కలిగిన కార్యకలాపాలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. "ప్రపంచ సంస్థలు ఇక్కడ విస్తరించాలి. ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. అత్యున్నత నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాలి. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది" అని చెప్పారు. డిఇ షా నియోపొలిస్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయాన్ని మంత్రి స్వాగతించారు. హైదరాబాద్‌పై సంస్థకు ఉన్న దీర్ఘకాలిక నమ్మకానికి ఇది మరో నిదర్శనమన్నారు. "నియోపొలిస్‌లో డిఇ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయం కేవలం మరో కార్యాలయం కాదు. హైదరాబాద్ భవిష్యత్తుపై, తెలంగాణ వృద్ధి ప్రయాణంపై ఆ సంస్థకు ఉన్న విశ్వాసానికి ఇది బలమైన సంకేతం" అని శ్రీధర్‌బాబు అన్నారు. కొత్త కార్యాలయం ద్వారా హైదరాబాద్‌లో డీఈ షా కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. "ఈ విస్తరణను తెలంగాణ స్వాగతిస్తోంది. రానున్న రోజుల్లో డీఈ షా రాష్ట్రంలో మరింతగా విస్తరిస్తుందని ఆశిస్తున్నాం" అని మంత్రి చెప్పారు. ప్రపంచస్థాయి సంస్థల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. "డిఇ షా నాయకత్వానికి నేను హామీ ఇస్తున్నాను. మీ వృద్ధి, విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది. మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇస్తాం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు తెలంగాణను మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం

మొదటిపేజీ తరువాయి

దాహంతో అల్లాడిపోతున్న ప్రాంతాలు ఏటికేడు పెరుగుతూనే ఉన్నాయి. ఎల్?నినో ప్రభావంతో నైరుతి తీవ్ర నిరాశ మిగల్చగా వర్షాభావ పరిస్థితులు నగరంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అడు గంటిన భూగర్భజలాలతో బోరుబావులు ఎండిపోతుండగా రిజర్వాయర్లలో నీటి మట్టాలు గణనీయంగా పడిపోతుండటం కలవరపెడుతోంది. పెరుగుతున్న తాగునీటి సమస్యకు తగ్గట్లు జలమండలి తాగునీటిని సరఫరా చేయలేకపోతుంది. ప్రతి బొట్టును సర్దుబాటు చేస్తూ తాగునీటి అవసరాలను తీరుస్తోంది. అయినా భాగ్యనగరంలోని చాలా బస్తీలు, శివారు ప్రాంతాలు నీటి కోసం అల్లాడిపోతున్నాయి. కోటిన్నరకు పైగా జనాభా ఉన్న భాగ్యనగరానికి కృష్ణా, గోదావరి జలాలతో పాటు సింగూరు, మంజీరా, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్? దాహం తీరుస్తున్నాయి. ఈ రిజర్వాయర్ల నుంచి నిత్యం జలమండలి దాదాపు 600 ఎం?జీడీల నీటిని అంటే 227 కోట్ల 12 లక్షల 46 వేల లీటర్లను సేకరించి సరఫరా చేస్తోంది. కృష్ణానది నుంచి 270 ఎంజీడీలు, గోదావరి నుంచి 162 ఎం?జీడీలు, సింగూరు, మంజీరా నుంచి 120 ఎం?జీడీలు, జంట జలాశయాల నుంచి 45 ఎం?జీడీల తాగునీరు జలమండలి పరిధిలోని 14న్నర లక్షల కనెక్షన్లకు సరఫరా అవుతోంది. అయితే ప్రజల అవసరాలకు మరో 100 నుంచి 200 ఎం?జీడీల నీరు అవసరమవుతోంది. లోటు వర్షపాతంతో బోరుబావులు ఎండిపోవడం వల్ల తమపై ఒత్తిడి పెరుగుతోందని జలమండలి చెబుతోంది. గృహాలతో పాటు వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం జలమండలి నీటిపై ఆధారపడటం వల్ల ఇతర ప్రాంతాల్లో కొరత తలెత్తుతోందని స్పష్టం చేస్తోంది.గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు బాగా తగ్గాయి. 2025లో సెప్టెంబర్ చివరి నాటికి అన్ని ప్రాజెక్టుల్లో కలిపి 25 టీఎంసీల నిల్వ ఉంది. ఈ ఏడాది 15 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇప్పటికే సింగూరు, మంజీరా డెడ్ స్టోరేజీకి దగ్గరలో ఉండగా వారం నుంచి అత్యవసర పంపింగ్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. జంట జలాశయాల్లో గతేడాది సెప్టెంబరుతో పోలిస్తే నీటి మట్టాలు గణనీయంగా తగ్గాయి. జూన్?లో స్వల్పంగా వరద వచ్చినప్పటికీ తర్వాత ఆశించిన వర్షాలు లేక పరివాహక ప్రాంతాలు ఎండిపోతున్నాయి.నగరానికి ప్రధాన దిక్కైన నాగార్జున సాగర్?, గోదావరి పంపింగ్ పాయింట్ల వద్ద నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. అధికారుల అంచనా ప్రకారం ప్రస్తుత నీటి నిల్వలు రానున్న మూడు నెలలకే సరిపోతాయని భావిస్తున్నారు. మరోవైపు శివారు మున్సిపాలిటీలను గ్రేటర్?లో కలపడంతో వాటికి నీళ్లు ఇచ్చే బాధ్యతను ప్రభుత్వం జలమండలికే అప్పగించింది. కోర్ సిటీలోనే అరకొరగా నీటిని అందిస్తోన్న జలమండలికి శివారు ప్రాంతాలకు నీరు అందించడం సవాలుగా మారింది. ఆ లోటును భర్తీ చేసేందుకు అనేక ప్రణాళికలు రూపొందిస్తున్నా సాధ్యమైన త్వరగా ఆచరణలోకి రావడం లేదు. చాలా ప్రాంతాలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను నగర ప్రజలు అర్థం చేసుకొని నీటి దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని జలమండలి కోరుతోంది. మరోవైపు అన్నదాతలు తమ పంటలను కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ బోర్లకు నిరంతరాయంగా కరెంటు సరఫరా లేకపోవడం, మరోవైపు భూగర్భ జలాలు పడిపోతుండడం కారణంగా పైర్లకు నీరందించడం రైతన్నలకు సవాలుగా మారుతోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 30.67 లక్షల వ్యవసాయ బోర్ల కనెక్షన్లు ఉన్నాయి. వాటికి ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్?ను సరఫరా చేస్తున్నట్లు డిస్కంలు పేర్కొంటున్నాయి. అయితే నిత్యం అంతరాయం, లో ఓల్టేజీల కారణంగా మోటార్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.వ్యవసాయ బోర్లకు ప్రతి సంవత్సరం కరెంటు డిమాండు పెరుగుతోంది. ఉమ్మడి ఏపీ నుంచి కొత్త రాష్ట్రంగా అవతరించిన సమయంలో కేవలం 18 లక్షల వ్యవసాయ బోర్లకు కరెంటు కనెక్షన్లు ఉంటే, నేడు ఆ సంఖ్య 30 లక్షలు దాటింది. అయితే మరో లక్షకుపైగా కనెక్షన్లు కావాలని అన్నదాతలు అడుగుతున్నారు. ఎల్?నినో కారణంగా ఈ వానాకాలంలో వర్షాలు సరిగా కురవవని, ఈ ఏడాది వేసవికి ముందు నుంచే వివిధ అధ్యయనాలు హెచ్చరించాయి. అయితే దీనికి తగ్గట్లు విద్యుత్? పంపిణీ సంస్థ (డిస్కం)లు ముందస్తు చర్యలు తీసుకోలేదనే విమర్శలొస్తున్నాయి.గత సంవత్సరం మార్చి 31 నుంచి నేటి వరకు 31 వేలకు పైగా కొత్త బోర్లకు కనెక్షన్లు ఇచ్చారు. రాష్ట్రంలో రోజుకు సగటున 30.10 కోట్ల యూనిట్ల విద్యుత్? వినియోగిస్తుండగా వాటిలో సుమారు 40 శాతం వ్యవసాయానికే వెళ్తోందని డిస్కంలు అంచనా వేస్తున్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి రాష్ట్రంలో వర్షాకాలంలో రికార్డు స్థాయిలో రోజువారీ గరిష్ఠ విద్యుత్? డిమాండు 19,892 మెగావాట్లకు చేరింది. ఎల్‌నినో నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా స్వల్పకాలిక పంటలసాగును ప్రోత్సహించేందుకు సర్కారు సన్నద్ధమైంది. రబీ కార్యాచరణ ప్రణాళికపై జిల్లా అధికారులకు వ్యవసాయ శాఖ దిశానిర్దేశం చేసింది. ఖరీఫ్ సీజన్ నిరుత్సాహంగా ముగిసినందున రబీలో అలాటి పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ప్రతికూల పరిస్థితులు, వర్షాభావం దృష్ట్యా సాధ్యమైనంత వరకు వరి సాగుచేయవద్దని సర్కార్ సూచిస్తోంది.కాగా రాష్ట్రంలోని మొత్తం 18 జిల్లాల్లో ఉన్న 320 మండలాల్లో కరవు తీవ్రత అత్యధికంగా ఉన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజీవ్ జోషి సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. సచివాలయంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ పనితీరు, తాజా పరిస్థితులపై సీఎస్ మంగళవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, పంటలు ఎండిపోయి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, సాగునీటి కొరత ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఈ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. కరువు పరిస్థితులపై కేవలం ఉపరితల పరిశీలన కాకుండా క్షేత్రస్థాయి నుంచి వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా సమగ్ర డేటాను సేకరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భ జలాలు (గ్రౌండ్ వాటర్), వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణ మంచినీటి సరఫరా తదితర కీలక శాఖల నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. జూన్ నెల నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగిన నైరుతి రుతుపవనాల కాలంలో నమోదైన వర్షపాతం, భూగర్భ జలాల మట్టాలు, పంట విస్తీర్ణం, తేమ శాతం సహా నిర్దేశిత 12 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకొని కరువు ప్రభావిత మండలాలను కచ్చితంగా గుర్తించాలని స్పష్టం చేశారు.ఈ ప్రక్రియ అంతా పూర్తి చేసి, అక్టోబర్ మాసాంతంలోపు పూర్తిస్థాయి కరువు నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, పంట నష్టాలు, సహాయక చర్యలపై చర్చించేందుకు ప్రభుత్వం త్వరలోనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని యోచిస్తున్నందున, దానికి అనుగుణంగా స్పష్టమైన నివేదికను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## కోట్లాది మంది విశ్వాసమే నా అతిపెద్ద బలం

ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు.ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు.బాధ్యతలను ఒక లక్ష్యంగా మార్చుకున్నామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కార్యాచరణే తన మతమని, భగవద్గీత బోధించిన 'కర్మణ్యే వాధికారస్తే' మార్గంలోనే నడుస్తున్నానని చెప్పారు. తాను ఎప్పుడూ కీర్తి ప్రతిష్టల గురించి పట్టించుకోలేదని, కేవలం దేశం కోసం పని చేయడమే తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాతికేళ్ల పాటు ప్రభుత్వం అధినేతగా కొనసాగుతానని తాను అసలు ఊహించలేదని, తన కెరీర్ ఇలా సాగుతుందని అసలు ఊహించలేదు అన్నారు. "దేశం నాకు చాలా ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత అందరికంటే ఎక్కువగా ఉంటుంది. భారత్‌లోని ప్రతి పౌరుడికీ నాపై అత్యంత హక్కు ఉందని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను" అన్నారు. ప్రధానమంత్రి మాట్లాడుతూ, "నేను దేశప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 7 అక్టోబర్ 2001న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ ఘట్టం వస్తుందని అనుకోలేదు. ఈరోజు ప్రభుత్వ అధినేతగా నిరంతరం సేవ చేస్తూ నేను 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాను. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదాల ఫలితం. బీజేపీ, ఎన్డీఏ, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉన్న రాజకీయ సహచరులందరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను దేశ ప్రజల పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అన్నారు.

మొదటిపేజీ తరువాయి

## రసాయన శాస్త్రంలో హెన్రీ కాగన్, కెన్నో సోయికి నోబెల్

జార్జ్ నాగెల్ ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ వుర్జ్‌బర్గ్ (జర్మనీ) మాలిక్యులర్ ప్లాంట్ ఫిజియాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. ఈ పురస్కారానికి ఎంపికైన పరిశోధనను ఆయన జర్మనీలోని 'మాక్స్ ప్లాంక్ ఇన్స్టిట్యూట్ ఫర్ బయోఫిజిక్స్'లో చేసి చూపించారు. వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతికి ఎంపికైన పీటర్ హెగెమాన్ 1984లో జర్మనీకి చెందిన మాక్స్ ప్లాంక్ ఇన్స్టిట్యూట్ ఫర్ బయోకెమిస్ట్రీ విభాగం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. జర్మనీలోని హంబోల్ట్ యూనివర్సిటీ ఆఫ్ బెర్లిన్‌లో 'హర్టీ సీనియర్ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరోసైన్స్'గా పీటర్ హెగెమాన్ చేస్తున్నారు. ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికైన పరిశోధనను ఆయన జర్మనీలోని మాక్స్ ప్లాంక్ ఇన్స్టిట్యూట్ ఫర్ బయోకెమిస్ట్రీ లో చేసి నిరూపించారు.నోబెల్ బహుమతి విజేతలకు అందించే మొత్తం నగదు బహుమతి 1.2 కోట్ల స్వీడిష్ క్రోనర్ (దాదాపు 11 లక్షల 96 వేల డాలర్లు). ఒకరు విజేతగా నిలిస్తే వారికే మొత్తం నగదు లభిస్తుంది. ముగ్గురు విజేతలు కనుక ఈ మొత్తాన్ని ఆ ఏడాది విజేతలకు సమానంగా పంచుతారు. నోబెల్ అసెంబ్లీ 1977 ఏడాదిలో స్థాపించారు. వైద్య రంగంలో నోబెల్ బహుమతిని అందజేసే కరోలిన్స్కా ఇన్స్టిట్యూట్‌కు ఇది ప్రధాన సంస్థ. స్టాక్‌హోంలోని కరోలిన్స్కా ఇన్స్టిట్యూట్‌లో నోబెల్ బహుమతి ప్రకటన చేస్తారు. ఈ ప్రకటనతో 2026 ఏడాదికిగానూ నోబెల్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇతర రంగాలలో సైతం నోబెల్ విజేతలను ప్రకటిస్తారు.

# ఈనెల 11 నుంచి ఏడుపాయల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు.. వైభవంగా ఏర్పాట్లు

ఈనెల 11 నుంచి ఏడుపాయల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

తెలంగాణ వీణ//మెదక్ జిల్లా ప్రతినిధి

పాపన్నపేట,అక్టోబర్ 7:తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మఠం వీరేశం తెలిపారు. బుధవారం ఆయన ఉత్సవాల వివరాలను వెల్లడించారు.శరన్నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారు వివిధ దేవతా అవతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 11న బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో (ముదురు పసుపు), 12న శ్రీ గాయత్రి దేవి అవతారంలో (గులాబీ), 13న శ్రీ అన్నపూర్ణ దేవి అవతారంలో (నీలం), 14న శ్రీ మహా చండీ దేవి అవతారంలో (ఆకుపచ్చ), 15న శ్రీ మహాలక్ష్మీ దేవి అవతారంలో (పెసర), 16న శ్రీ సరస్వతీ దేవి అవతారంలో (తెలుపు), 17న శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో (నారింజ), 18న శ్రీ దుర్గాదేవి అవతారంలో (ఎరుపు), 19న శ్రీ మహిషాసుర మర్ధిని దేవి అవతారంలో (మెరూన్), 20న శ్రీ రాజరాజేశ్వరీ దేవి వనదుర్గాదేవి అవతారంలో (పసుపు) భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఈఓ తెలిపారు.ఈనెల 15న దుర్గామాతకు బోనాలు, 19నసువాసిని పూజతో పాటు చండీ హోమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ గోత్రనామార్చన పూజకు రూ.1,116 రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే నవరాత్రుల్లో ఏదైనా ఒకరోజు పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులు రూ.251 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.
నవరాత్రి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఈఓ మఠం వీరేశం కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పల్లె సాయిబాబా, నరేష్, మహేష్, యాదగిరి, దీపక్ రెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు




# ఖమ్మం జిల్లా లో అర్హులందరికీ ఆసరా పింఛన్లు మంజూరు చేయాలి.

## జిల్లా కలెక్టర్‌కు ఖమ్మం జిల్లా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వినతి.

అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ కాసోజు, కరుణాకర్ సుధగాని

తెలంగాణ వీణ //ఖమ్మం బ్యూరో

ఖమ్మం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఖమ్మం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఖమ్మం జిల్లా ఇన్వార్డ్ సెక్షన్ కలెక్టరేట్ ఆఫీస్ లో కమిటీ ప్రతినిధులు వినతిపత్రాన్ని సమర్పించారు. ?ఈ సందర్భంగా కమిటీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ కాసోజు, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ సుధగాని మాట్లాడుతూ, ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో వృద్ధులు, వికలాంగులు, విధవలు, ఒంటరి మహిళలు మరియు ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన అనేకమంది అర్హత కలిగి ఉన్నప్పటికీ, ఇప్పటికీ వారికి ఆసరా పింఛన్లు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమందికి గతంలో అర్హుల జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ పింఛన్లు నిలిపివేశారని, మరికొందరి దరఖాస్తులు గ్రామ స్థాయిలో పెండింగ్‌లోనే ఉండిపోయాయని తెలిపారు.కమిటీ ప్రధాన డిమాండ్లు: 1)నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించి, అర్హులైన వారి పేర్లతో ప్రత్యేక నివేదికలు తయారు చేయాలి. 2)?గతంలో దరఖాస్తు చేసుకుని ఇంకా పింఛన్ రాని వారి అర్జీలను వెంటనే పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలి. 3)?అనర్హులకు ఇస్తున్న పింఛన్లను రద్దు చేసి, నిజమైన పేదలకు, అర్హులకు మాత్రమే మంజూరు చేయాలి. 4)?తీసుకున్న చర్యలు, నిర్ణయాలపై జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించి, సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీకి లిఖితపూర్వకంగా తెలియజేయాలి. ?సామాజిక న్యాయం దిశగా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్ అందేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కమిటీ సభ్యులు కోరారు.






?ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# 28న" జర్నలిస్టుల"ఛలో ఢిల్లీ"

## -జంతర్ మంతర్ లో ఒక రోజు నిరసన

తెలంగాణ వీణ //ఖమ్మం బ్యూరో

హైదరాబాద్ ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం "జర్నలిస్టుల రక్షణ చట్టం"అమలు చేయాలనే డిమాండ్ తో ఈ నెల 28వ తేదీన "ఛలో ఢిల్లీ" కార్యక్రమం చేపడుతున్నట్లు ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యులు,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం పరిధిలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఆ రోజు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వందలాది మంది జర్నలిస్టులతో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో ధర్నా జరుగుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివెళతారని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలను అరికట్టి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయాలన్న ఐఎఫ్ డబ్ల్యూజే దీర్ఘకాలిక డిమాండ్ ను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. అదేవిధంగా సీనియర్ జర్నలిస్టుల కోసం జాతీయ పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాస్ లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీర్ఘ కాలిక ఈ డిమాండ్ల సాధనకై 28న తలపెట్టిన "ఛలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.




ఓట్ చోరికి పాల్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ను తొలగించకపోతే

# ఉద్యమాలను ఉధృతం చేస్తాం.

-వామపక్ష విద్యార్థి యువజన సంఘాల నేతల హెచ్చరిక.

ఖమ్మంలో జరగబోయే విద్యార్థి,యువజన ప్రజాప్రదర్శనను జయప్రదం చేయండి.విద్యార్థులపై,యువతపై పోలీసుల లాఠీ చార్జీలను ఖండిస్తూ..

వామపక్ష విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన.

తెలంగాణ వీణ //ఖమ్మం బ్యూరో

ఖమ్మం దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలల్లో 13 కోట్ల పైగా ఓట్లను తొలగించి,ఓటు చోరీకి పాల్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించకపోతే దేశవ్యాప్తంగా పోరాటాలను ఉదృతం చేస్తామని,విద్యార్థులపై యువతపై బిజెపి మోడీ ప్రభుత్వం చేస్తున్న లాఠీ చార్జీలను వెంటనే ఆపాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల.రమేష్,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.మనోజ్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్, పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి మస్తాన్,పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.మోడీ బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులపై యువతపై పోలీసులు చేస్తున్న లాటి చార్జీలను ధమనకాండను ఖండిస్తూ వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎస్.ఆర్.బి.జి. యన్.ఆర్ ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థలు గా ఉండాల్సిన సుప్రీంకోర్టు,ఎన్నికల కమిషన్ లను కూడా బిజెపి,మోడీ ప్రభుత్వం జేబు సంస్థలుగా వాడుకుంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలపైనే 13 కోట్ల ఓట్లను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేశారని వారన్నారు.వెంటనే ఓటు చోరీకి పాల్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ను తొలగించి అరెస్ట్ చేయాలని,సర్ ప్రక్రియను ఆపాలని లేకపోతే దేశ వ్యాప్తంగా పోరాటాలను ఉదృతం చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీ.రాజు, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు.శ్రావణ్,ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు త్రినాథ్,సుశాంత్,శ్రీరామ్,మనోహర్,జానీ పాషా,ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మేకల.పవన్,పి.డి.ఎస్.యు జిల్లా నాయకులు రాము,విశ్వంత్,సంజయ్,చందు,పి.డి.ఎస్.యు జిల్లా తిమ్మిడి.రఘు,బాలు,చరణ్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# అవసరాలకు అనుగుణంగా సమతుల్యంగా ఎరువులు వాడాలి

వ్యవసాయ శాఖ కూసుమంచి సహాయ సంచాలకులు రాజేష్.

నేలకొండపల్లి/తెలంగాణ వీణ

అవసరాలకు అనుగుణంగా సమతుల్యంగా ఎరువులను వాడాలని వ్యవసాయ శాఖ కూసుమంచి సహాయ సంచాలకులు రాజేష్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో బుధవారం ఇండియన్ పోటాష్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో పీఎం కిసాన్ సంగోష్టి సమతుల్య ఎరువుల వినియోగం పై రైతులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...రైతులు ఎరువులను సరైన మోతాదులో సరైన సమయంలో సరైన పద్ధతులలో వినియోగించటం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుని పంట దిగుబడి ని మెరుగుపరుచుకోవచ్చునని తెలిపారు. వేప పూత .యూరియా, నానో ఎరువులు. పీడీఎం. సేంద్రియ ఎరువులను పంట అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఐపీఎల్ స్టేట్ హెడ్ సాగర్ ప్రకాష్ బోట్, మార్కెటింగ్ మేనేజర్ మురళీధరన్, ఖమ్మం సేల్స్ మేనేజర్ శైలేంద్ర, నితిన్రావు, ఏఈవో దాత్రి, సర్పంచ్ లు బోయిన వేణు, వల్లాల రాధాకృష్ణ, రైతు ప్రతినిధులు బచ్చలకూరి నాగరాజు, ఇరగదిండ్ల నాగరాజు, మన్నె కృష్ణారావు, మంకెన వెంకటేశ్వరరావు, చింతనిప్పు సైదులు, కడియాల నరేష్ కోసూరి రాజాబాబు, వెన్నబోయిన కమలాకర్, కాళంగి గణేష్ తదితరులు పాల్గొన్నారు.




# విద్యారంగం ను గందరగోళంగా మారుస్తున్న ప్రభుత్వం

కార్పోరేట్ శక్తుల చేతిలో బంధీగా ఉన్న విద్యారంగం.

టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంగళరావు.

నేలకొండపల్లి/తెలంగాణ వీణ

విద్యా రంగం ను తెలంగాణ ప్రభుత్వం గందరగోళంగా మారుస్తుందని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంగళరావు ఆరోపించారు. మండల కేంద్రంలో సంఘం మండల కమిటి సమావేశంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు..విద్యాశాఖను సాక్షాతూ ముఖ్యమంత్రి నిర్వహిస్తున్నప్పటకీ ఒక స్పష్టమైన విధి విధానాలు లేకుండా విద్యా శాఖ నిర్వహించటం దారుణం అన్నారు. విద్యా రంగం పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరో తరగతి నుంచి 9 వరకు పరీక్ష పేపర్లు బాహ్య మూల్యంకనం మండల కేంద్రంలో చేయాలని ఆదేశాలు సరికాదని అన్నారు. పేపరు కు మూడు రూపాయలు ఇస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మూల్యంకం వలన విద్యార్థులలో గందరగోళ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వెంటనే బాహ్య మూల్యంకన ప్రక్రియ ను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం కు విద్యాశాఖ పై ప్రేమ ఉంటే పదో తరగతి పేపర్ల మూల్యంకనం చేసిన బిల్లులను విడుదల చేయాలని కోరారు. విద్యా రంగం కార్పోరేట్ శక్తుల చేతిలో బంధీగా ఉందన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులను పోస్టులను భర్తీ చేయాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు పి. నాగిరెడ్డి, మల్లయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శు కార్యదర్శులు గా టి.గోవిందరావు, టి.రామారావు లు, ఉపాధ్యాక్షుడు గా రవి, అనిల్, చీనా, కార్యదర్శులు గా గణేష్, లెనిన్, నాగరాజు, చావా జ్యోతి, శంకర్, వెంకన్న, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, గోవిందరెడ్డి, శ్రీనివాసరావు, రాంబాబు, భాగ్యలక్ష్మి, జ్యోతిర్మయి, వాణిశ్రీ, నాగేల్మీరా,సరిత తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.







# ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమికి జైకొట్టాలి

ఉద్యోగ భద్రత, కార్మిక హక్కుల సాధనకు భారీ మెజార్టీ ఇవ్వాలి...

- కరీంనగర్-1, 2 డిపోల వద్ద జేఏసీ గేట్ మీటింగ్‌లు....

**తెలంగాణవీణ, కరీంనగర్ :**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో అక్టోబర్ 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ , నేషనల్ మజ్దూర్ యూనియన్ , ఐక్య కూటమిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మిక నేతలు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కరీంనగర్-1, కరీంనగర్-2 డిపోల ఎదుట జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా బాధ్యులు ఎస్. సన్నీ ఎడ్వర్డ్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి. కాళిదాస్ మాట్లాడారు. సుదీర్ఘకాలంగా గుర్తింపు సంఘం ఎన్నికలు లేకపోవడం వల్లే కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఐక్య కూటమి అభ్యర్థులకే ఉద్యోగులు అండగా నిలవాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేయాలి. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 61 సంవత్సరాలకు పెంచాలి. మహిళా ఉద్యోగులకు 240 రోజుల ప్రసూతి సెలవులతో పాటు 'చైల్డ్ కేర్ లీవ్' సౌకర్యం కల్పించాలి.గ్యారేజీల్లో పనిచేస్తున్న మెకానిక్‌లకు సహాయకులను నియమించి, ఆధునిక పవర్ టూల్స్ అందించాలి.రిటైర్డ్ ఉద్యోగులకు సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పునరుద్ధరించా లని డిమాండ్ చేశారు.అక్టోబర్ 9న జరిగే పోలింగ్‌లో రాష్ట్ర స్థాయి గుర్తింపు కోసం 'బస్సు' గుర్తుపై, రీజియన్ స్థాయిలో 'కాగడా', 'నిచ్చెన' గుర్తులపై ఓట్లు వేసి ఐక్య కూటమి అభ్యర్థులను విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి చీర్లవంచ శ్రీనివాస్, డిపో చైర్మన్ కనకనాల తిరుపతయ్య, టీఎంయూ నాయకులు ఎం.ఆర్. రెడ్డి, కనకయ్య, మహిళా కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.



# అక్రిడిటేషన్ కార్డుల పేరుతో అక్రమ వసూళ్లు చేస్తే ఉపేక్షించం..

## -మెదక్ ప్రెస్‌క్లబ్ అభ్యున్నతే లక్ష్యం,జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

## -డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం అర్హులైన జర్నలిస్టులకు సహకారం

## -మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శివ్వన్నగారి నరసింహ చారి

**తెలంగాణ వీణ//మెదక్ జిల్లా ప్రతినిదిమెదక్, అక్టోబర్ 7 :**



అక్రిడిటేషన్ కార్డులు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేయడం, మెదక్ ప్రెస్‌క్లబ్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శివ్వన్నగారి నరసింహ చారి పేర్కొన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం, ప్రెస్‌క్లబ్ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా నూతన కార్యవర్గం పనిచేస్తోందని తెలిపారు. మెదక్ జిల్లాలో అక్రిడిటేషన్ కమిటీకి సంబంధించి కొందరు భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డులు ఇప్పిస్తామనే పేరుతో జర్నలిస్టుల నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ విషయం పై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా మెదక్ ప్రెస్‌క్లబ్ పేరును ఉపయోగించి ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడినా చర్యలు తప్పవని, కొందరు తమ వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైనప్పుడు మెడికల్ అసోసియేషన్‌తో మాట్లాడి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. జర్నలిస్టుల పిల్లల పాఠశాల ఫీజుల సమస్యలపై ఆయా పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. ప్రెస్‌క్లబ్ సభ్యులందరి సహకారం, సూచనలతో క్లబ్‌ను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో సభ్యులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ తమ ఆలోచనలు, సూచనలు పంచుకోవాలని కోరారు. నూతన కార్యవర్గం ఏర్పాటైన తక్కువ కాలంలోనే ప్రెస్‌క్లబ్ భవనాన్ని అన్ని రకాల సౌకర్యాలతో తీర్చిదిద్దడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. భవిష్యత్‌లోనూ సభ్యుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు సమకూర్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లేని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు మంజూరయ్యేలా ప్రభుత్వ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశంలో ప్రెస్‌క్లబ్ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రెస్ క్లబ్ మౌలిక సదుపాయాలకు దాతల సహకారంతో సమకూరిన ఆదాయం వ్యయం, దాతల పేర్లు వంటి అంశాలను కోశాధికారి చెవిటి అశోక్ సభలో చదివి వినిపించారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బచ్చు సంగమేశ్వర్, కార్యవర్గ సభ్యులు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# మెదక్‌లో ఘనంగా సేవా జ్యోతి కలశ యాత్ర

**తెలంగాణ వీణ//మెదక్ జిల్లా ప్రతినిధి మెదక్, అక్టోబర్ 07:**

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమంలో భాగంగా బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో "సేవా జ్యోతి కలశ యాత్ర" ఘనంగా నిర్వహించారు.మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ గారి ఆధ్వర్యంలో, ఉదయం 9 గంటలకు మెదక్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద సేవా జ్యోతి కలశ యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు గారు హాజరయ్యారు.అనంతరం రాందాస్ చౌరస్తా నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాదయాత్రగా పాల్గొని పోస్టాఫీసు కూడలి వరకు చేరుకున్నారు. అక్కడ లి"సేవా జ్యోతి కూడలి"లిగా పేరు పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ద్వారా ప్రారంభమైన ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా "సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ గారు మాట్లాడుతూ, ప్రజాసేవ, సుపరిపాలన, దేశ అభివృద్ధి లక్ష్యాలతో సాగుతున్న సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనిపిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి మెదక్ జిల్లా ఇన్చార్జి బొక్క నరసింహారెడ్డి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, సంగసని సురేష్, పట్టణ అధ్యక్షుడు నాని ప్రసాద్ మెదక్ కౌన్సిలర్ అఖిలాభారత్ పబా రాజమణి లక్ష్మణ్ బెండవీన, కలిపి నాగరాజు నల్లాల విజయ్ లోకేష్ అల్లం మధు, యువ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మల్లికా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు గ్యాన్సింగ్ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రాములు నాయక్ ,వెల్మకన్నె రాజేందర్ శంకర్ గౌడ్ ఎశ్రీఅ రెడ్డి ,నాయకులు, మండల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, మోర్చాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రీ-లాంచ్ పేరుతో రూ.500 కోట్ల మోసం!

## సంస్థ చైర్మన్ పై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు

**తెల్లాపూర్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

తెల్లాపూర్‌లో ప్రీ-లాంచ్ ప్రాజెక్టు పేరుతో త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ తమను మోసం చేసిందని ఆరోపిస్తూ సుమారు 350 మంది బాధితులు బుధవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులను ఆశ్రయించారు. ఫ్లాట్ల కోసం తమ నుంచి సుమారు రూ.500 కోట్లు వసూలు చేసి, నిర్మాణం చేపట్టకుండా మోసం చేశారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. సంస్థ ఫౌండర్-చైర్మన్ పసుపులేటి సుధాకర్‌తో పాటు ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుల కథనం ప్రకారం, 2021లో తెల్లాపూర్‌లో "త్రిపుర నిర్వాణ" పేరుతో ఓ భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్టును త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ ప్రకటించింది. మార్కెట్ ధరల కంటే తక్కువకే ఫ్లాట్లు ఇస్తామని ప్రీ-లాంచ్ ఆఫర్‌తో ఆకర్షించడంతో, ఎంతోమంది తమ కష్టార్జితాన్ని ఈ ప్రాజెక్టులో పెట్టుబడిగా పెట్టారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బీడీఎల్ ప్రస్తుత, మాజీ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారు అధికంగా ఉన్నారు. డబ్బులు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా, ఇంతవరకు కనీసం పునాది పనులు కూడా మొదలుపెట్టలేదని బాధితులు వాపోతున్నారు. ప్రాజెక్టు కోసం కేటాయించిన భూమిని తమకు న్యాయం చేయకుండా మరో నిర్మాణ సంస్థకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితులు తమ ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేశారు. త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ తెల్లాపూర్ ప్రాజెక్టుపై కేసులు నమోదు కావడం ఇది మొదటిసారి కాదు. ఇదే ప్రాజెక్టుకు సంబంధించి 10 మంది కొనుగోలుదారుల నుంచి రూ. 5.68 కోట్లు వసూలు చేశారని ఆరోపిస్తూ ఈ ఏడాది మార్చిలో హైదరాబాద్ సీసీఎస్‌లో ఒక కేసు నమోదైంది. అంతకుముందు, 2025 నవంబర్‌లో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలోనూ 'త్రిపుర నిర్వాణ' పేరుతో చేపట్టిన ప్రాజెక్టులో 9 మంది ఇన్వెస్టర్లు రూ. 4.41 కోట్లు నష్టపోయామని ఫిర్యాదు చేశారు. ఈ కేసులతో పాటు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ-రెరా) ఎదుట కూడా త్రిపుర కన్‌స్ట్రక్షన్స్‌పై పలు ఫిర్యాదులు ఉన్నాయి. తూప్రాన్ సమీపంలోని 'త్రిపుర సుకృతి' ప్రాజెక్టుకు సంబంధించి రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే ప్లాట్లు విక్రయించినట్లు గతంలో టీజీ-రెరా నిర్ధారించింది. ఈ లావాదేవీలపై విచారణ జరిపి, తమ డబ్బును తిరిగి ఇప్పించాలని వారు పోలీసులను వేడుకున్నారు. కాగా, బాధితులు ఆరోపిస్తున్న రూ.500 కోట్ల సంఖ్యపై పోలీసుల దర్యాప్తు తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

జాతీయ ఆరోగ్య మిషన్ కింద వివిధ కేటగిరీల పోస్టుల భర్తీకి

# దరఖాస్తుల ఆహ్వానం

## -డాక్టర్ బి రామారావు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ఖమ్మం

**తెలంగాణ వీణ //ఖమ్మం బ్యూరో**

ఖమ్మం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్ విభాగంలో వివిధ కేటగిరీలలో ఖాళీగా ఉన్న 99 పోస్టులను కాంట్రాక్ట్ / అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామక ప్రక్రియను జిల్లా కలెక్టర్ ట జిల్లా మేజిస్ట్రేట్ గారి అధ్యక్షతన ఏర్పడిన జిల్లా ఎంపిక కమిటీ ద్వారా పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుంది.ముఖ్యమైన సమాచారం ట మార్గదర్శకాలు పోస్టుల సంఖ్య: 99 నియామక విధానం: కాంట్రాక్ట్ / అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికనదరఖాస్తు స్వీకరణ తేదీలు: 08-10-2026 నుండి 13-10-2026 వరకు (కార్యాలయ పనివేళల్లో 5.00గ్రా.వీ.)దరఖాస్తు చేసుకునే విధానం: అర్హులైన అభ్యర్థులు ఖమ్మం జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుండి దరఖాస్తు ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పూర్తిగా నింపిన దరఖాస్తు ఫారమ్‌తో పాటు సంబంధిత విద్యార్హతలు, కుల, స్థానికత మరియు ఇతర ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను జతచేయాలి దరఖాస్తు సమర్పించాల్సిన చిరునామా: జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, రూమ్ నం. ఖీ-1, కలెక్టరేట్ కాంప్లెక్స్ వి. వెంకటాయపాలెం, ఖమ్మం. పోస్టుల వివరాలు, విద్యార్హతలు, వయోపరిమితి, ఎంపిక నిబంధనలు తదితర పూర్తి వివరాల కోసం జిల్లా అధికారిక వెబ్‌సైట్ సందర్శించాల్సిందిగా కోరడమైనది. నిర్ణీత గడువు (13-10-2026, 5.00 గ్రా.వీ.) ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణించబోమని స్పష్టం చేశారు.



# యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం- ముగ్గురు టెన్నిస్ క్రీడాకారులు మృతి

**పూర్వాంచల్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రహదారిపై ఆగి ఉన్న ఒక ట్రక్కును కారు వెనుక నుంచి అతివేగంగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, గాయపడిన వారందరినీ టెన్నిస్ క్రీడాకారులుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, అయోధ్య పరిధిలోని 97.500 మైలురాయి వద్ద బుధవారం వేకువజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లక్నోలో నిర్వహించిన ఒక టెన్నిస్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆరుగురు యువకులు తిరిగి దేవరియాకు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం ధాటికి కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. వాహనంలో చిక్కుకున్న వారిని యూపీఈఐడీఏ భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు అతికష్టం మీద వెలికితీశారు. ఈ ఘటనలో దేవరియాకు చెందిన నిత్యా ప్రజాపతి (22), ఇర్ఫాన్ అన్సారీ (20), అనికేత్ (24) మృతి చెందారు. ఆనంద్ యాదవ్ (23), రాజు (22), జయంత్ శర్మ (30) తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అయోధ్యలోని దర్శన్ నగర్ మెడికల్ కాలేజీకి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో తామందరం నిద్రలో ఉన్నామని, అసలేం జరిగిందో కూడా తెలియలేదని గాయపడిన జయంత్ పోలీసులకు చెప్పాడు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్కు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న ట్రక్కు డ్రైవర్‌ను గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.


తెలంగాణవీణ

తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి 8328209811

తెలంగాణవీణ
నిజం నిగ్గు తేల్చుతాం..
08 శుక్రవారం అక్టోబర్ 2026
www.epaper.telanganaveena.in


# ఆర్బీఐ నిర్ణయంతో స్టాక్ మార్కెట్ కుదేలు..



**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

దేశీయ స్టాక్ మార్కెట్లకు బుధవారం భారీ షాక్ తగిలింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.5 శాతానికి చేర్చడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో వరుసగా రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ 429.11 పాయింట్లు నష్టపోయి 72,638.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 173.05 పాయింట్లు కోల్పోయి 22,603.05 వద్ద స్థిరపడింది. ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచడంతో పాటు తన ద్రవ్య విధాన వైఖరిని 'క్యాలిబ్రేటెడ్ టైటనింగ్'గా మార్చింది. దీంతో రానున్న రోజుల్లో వడ్డీ రేట్ల పరిస్థితి మరింత కఠినంగా ఉండొచ్చన్న ఆందోళన ఇన్వెస్టర్లలో పెరిగింది. ఫలితంగా మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ 22,700 స్థాయిని కోల్పోయి 22,600 కీలక మద్దతు స్థాయికి చేరిందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 22,600 కంటే దిగువన స్థిరంగా కొనసాగితే 22,400 వరకు పడిపోయే అవకాశం ఉందన్నారు. పైకి వెళ్లాలంటే 22,800 స్థాయి కీలక అడ్డంకిగా ఉంటుందని పేర్కొన్నారు. నిఫ్టీలో టైటాన్ కంపెనీ, బీఈఎల్, హిందాల్కో ఇండస్ట్రీస్ షేర్లు భారీగా నష్టపోయాయి. ముఖ్యంగా మెటల్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో మార్కెట్‌పై ఒత్తిడి పెరిగింది. విస్తృత మార్కెట్‌లోనూ బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.63 శాతం పడిపోయింది. అయితే నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.30 శాతం లాభపడటం కొంత ఊరటనిచ్చింది. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ సూచీ అత్యధికంగా నష్టపోయింది. మరోవైపు నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ లాభాల్లో ముగిసి మార్కెట్‌కు కొంత మద్దతుగా నిలిచింది. ఇక రానున్న రోజుల్లో ఆర్బీఐ నిర్ణయాలు ఆర్థిక వృద్ధి, మార్కెట్‌లో నగదు లభ్యత, కంపెనీల ఆదాయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఇన్వెస్టర్లు పరిశీలించనున్నారు. సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాల సీజన్ కూడా మార్కెట్‌కు కీలకం కానుంది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలను కంపెనీలు ఎలా ఎదుర్కొంటాయి? ధరలను కొనసాగించగలవా? డిమాండ్‌ను నిలబెట్టుకోగలవా? అన్న అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నారు.మరోవైపు ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) బజాజ్ ఫైనాన్స్, తన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీ) వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 7 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త రేట్ల ప్రకారం, వడ్డీని 15 నుంచి 40 బేసిస్ పాయింట్ల వరకు పెంచారు. దీనివల్ల సీనియర్ సిటిజన్లు గరిష్ఠంగా 8.15 శాతం వరకు వడ్డీని పొందనున్నారు. ఆర్బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచడంతో 5.50 శాతానికి చేరిన నేపథ్యంలో, బజాజ్ ఫైనాన్స్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. తాజా సవరణల ప్రకారం, సాధారణ డిపాజిటర్లు 31 నుంచి 60 నెలల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై ఇప్పుడు 7.75 శాతం వరకు వార్షిక వడ్డీని పొందవచ్చు. గతంలో ఈ వడ్డీ రేటు 7.40 శాతంగా ఉండేది. అదేవిధంగా, 12-17 నెలల డిపాజిట్లపై వడ్డీని 6.80 శాతానికి, 18-30 నెలల డిపాజిట్లపై 7.00 శాతానికి పెంచారు. సీనియర్ సిటిజన్లకు సాధారణ రేట్ల కంటే అదనంగా 0.40 శాతం అధిక వడ్డీని సంస్థ అందించనుంది. దీంతో 31-60 నెలల కాలపరిమితి గల డిపాజిట్లపై వారికి గరిష్ఠంగా 8.15 శాతం వడ్డీ లభిస్తుంది. ఇక ఇప్పటికే ఉన్న డిపాజిట్లను రెన్యూవల్ చేసుకునే వారికి అదనంగా 0.10 శాతం ప్రయోజనం ఉంటుంది. తద్వారా సీనియర్ సిటిజన్లు రెన్యూవల్‌పై గరిష్ఠంగా 8.25 శాతం వరకు వడ్డీ పొందే అవకాశం ఉంది. ఈ పెంచిన వడ్డీ రేట్లు క్యుములేటివ్, నాన్-క్యుములేటివ్ ఆప్షన్లు రెండింటికీ వర్తిస్తాయి. కనిష్ఠంగా రూ. 15,000 నుంచి గరిష్ఠంగా రూ. 3 కోట్ల వరకు చేసే డిపాజిట్లకు ఈ సవరించిన రేట్లు వర్తిస్తాయని కంపెనీ స్పష్టం చేసింది.

## పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

### సమన్వయంతో సమర్థవంతంగా చేపట్టాలి

### ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం

**హైదరాబాద్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు.తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, శశాంక, అనుదీప్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ, ఎండీ, అజిత్ రెడ్డి, నిఖిల్ చక్రవర్తి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## రైతన్న అరచేతిలో పరిష్కారం

### కిసాన్ హెల్త్లైన్ సెంటర్ ఏర్పాటు

### మొబైల్ ఫో న్ ద్వారా సేవలకు మరో ముందడుగు

**హైదరాబాద్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

వ్యవసాయ విస్తరణ అధికారి నుంచి కమిషనరేట్ స్థాయి అధికారుల వరకు రైతులకు ఇప్పటికే వ్యవసాయ విస్తరణ సేవలు అందుతున్నాయి. వీటికి అదనంగా, రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం అరచేతిలోని మొబైల్ ఫోన్ ద్వారానే సలహాలు పొందేందుకు వీలుగా కిసాన్ హెల్ప్లైన్ సెంటర్ మరో ముందడుగుగా నిలుస్తోంది. పంటకు తెగులు సోకినా, ఎరువు ఎంత వేయాలో తెలియకపోయినా, ప్రభుత్వ పథకం అందకపోయినా రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1800-180-1551 కు ఫోన్ చేస్తే చాలు. తెలుగులోనే తక్షణ సలహా, సమాచారం అందుతాయి. సేవలు ప్రతిరోజూ ఉదయం 6:00 గంటల నుంచి రాత్రి 10:00 గంటల వరకు, వారంలో 7 రోజులూ అందుబాటులో ఉంటాయి. కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2004 నుంచి దేశవ్యాప్తంగా అమలవుతున్న ఈ కేంద్రం, తెలంగాణ రైతుల కోసం హైదరాబాద్లోని వ్యవసాయ కమిషనర్ మరియు సంచాలకుల కార్యాలయంలో పనిచేస్తోంది. సలహాలతో పాటు, వ్యవసాయ పథకాలకు సంబంధించిన రైతుల ఫిర్యాదులను కూడా ఇదే నంబర్ ద్వారా తెలియజేయవచ్చు. "రైతుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" ఇదే డిజిటల్ వేదికపై అందుబాటులో ఉండగా, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో కేంద్రం సహాయపడుతుంది. ఈ సేవలు మారుమూల గ్రామాల్లోని ప్రతి రైతుకూ తెలిసేలా, క్షేత్రస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని, రైతులు తమ సందేహాల నివృత్తికి, సమస్యల పరిష్కారానికి ఈ టోల్ ఫ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి, ఐ.ఏ.ఎస్ సూచించారు.

# అమెరికాలో 40 మంది పౌరసత్వం రద్దు..

## జాబితాలో పలువురు భారతీయులు!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

అమెరికా ప్రభుత్వం పౌరసత్వం విషయంలో కీలక చర్యలు చేపట్టింది. తప్పుడు వివరాలు ఇచ్చి లేదా తమ గతాన్ని దాచిపెట్టి అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 40 మందిపై పౌరసత్వం రద్దు చేసేందుకు న్యాయపరమైన ప్రక్రియను ప్రారంభించింది. వీరిలో భారతీయుడు కూడా ఉన్నారు. అమెరికా ఆధునిక చరిత్రలో ఇదే అతిపెద్ద 'డీ-న్యాచురలైజేషన్' చర్యగా న్యాయశాఖ పేర్కొంది. అమెరికా పౌరసత్వాన్ని మోసం, చట్టవిరుద్ధ మార్గాల ద్వారా పొందిన వారిపై చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని దీంతో స్పష్టమవుతోంది. ఆగస్టు 21 నుంచి అక్టోబర్ 2 మధ్య దేశంలోని 19 ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టుల్లో ఈ 40 మందిపై సివిల్ కేసులు దాఖలయ్యాయి. వీరిలో కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసిన సమయంలో తమకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను దాచిపెట్టారని, తప్పుడు సమాచారం ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. గూఢచర్యం నుంచి లైంగిక నేరాల వరకు వివిధ తీవ్రమైన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు తమ గతాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందారని అమెరికా అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ తెలిపారు. పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసాలను సహించబోమని స్పష్టం చేశారు. అమెరికా అధికారుల ప్రకారం బల్వీందర్ సింగ్ రెండు వేర్వేరు గుర్తింపులను ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 1992లో ఒక గుర్తింపుతో ఇమ్మిగ్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆయన 2003లో మరో గుర్తింపుతో శాశ్వత నివాస హోదా (పర్మినెంట్ రెసిడెంట్) పొందినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత 2009లో అదే రెండో గుర్తింపుతో అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే రెండు వేర్వేరు దరఖాస్తుల్లో నమోదైన వేలిముద్రలను పరిశీలించిన అధికారులు అవి ఒకే వ్యక్తివని గుర్తించినట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ జాబితాలో అమెరికా నౌకాదళ మాజీ సైనికుడు జిన్‌చావో వీ కూడా ఉన్నారు. చైనాకు గూఢచర్యం చేశారనే ఆరోపణలతో ఆయన ప్రస్తుతం 200 నెలల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. మిగతా వ్యక్తులపై హత్య, మనీ లాండరింగ్, లైంగిక నేరాలు, పన్ను ఎగవేత, వివాహ మోసం వంటి పలు ఆరోపణలు ఉన్నట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ 40 మందిలో ఒక్క దేశానికి చెందిన వారు మాత్రమే లేరు. మెక్సికో, పాకిస్థాన్, చైనా, నేపాల్, ఇరాన్, నైజీరియా సహా 20కి పైగా దేశాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. వీరిపై ఉన్న ఆరోపణలు, పౌరసత్వం పొందే సమయంలో వారు ఇచ్చిన సమాచారం ఇతర అంశాలను కోర్టులు పరిశీలించనున్నాయి. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం ప్రకారం.. మోసం చేసి లేదా కీలకమైన సమాచారాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందినట్లు కోర్టులో రుజువైతే, వారి సహజీకృత పౌరసత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంది. పౌరసత్వం రద్దైన తర్వాత సంబంధిత వ్యక్తులను అమెరికా నుంచి బహిష్కరించే డిపోర్టేషన్ ప్రారంభం కావచ్చు. అయితే ఈ 40 మందిపై నమోదైన కేసులన్నీ ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఆరోపణలు కోర్టులో రుజువు కావాల్సి ఉంది.

## ఓపెన్‌ఏఐ, ఆంథ్రోపిక్‌లో చైనా గూఢచారులు..

### మాజీ పరిశోధకుడి సంచలన ఆరోపణలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

అమెరికా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో సంచలన ఆరోపణలు తెరపైకి వచ్చాయి. చైనాకు చెందిన గూఢచారులు ఇప్పటికే అమెరికా ప్రముఖ ఏఐ సంస్థలు ఓపెన్‌ఏఐ, ఆంథ్రోపిక్‌లోకి చొరబడ్డారని మాజీ పరిశోధకుడు జాకబ్ కాక్సన్ ఆరోపించారు. ఈ విషయం 90 శాతం నిజమని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. అమెరికన్ వ్యాపారవేత్త ప్యాట్రిక్ బెట్-డేవిడ్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో కాక్సన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై ఎంత నమ్మకం ఉందని అడగ్గా.. "90 శాతం నమ్మకంగా ఉన్నాను" అని స్పష్టం చేశారు. కాక్సన్ గతంలో ఓపెన్‌ఏఐ, ఆ తర్వాత ఆంథ్రోపిక్‌లో పరిశోధకుడిగా పనిచేశారు. ఏఐ అభివృద్ధి అత్యంత వేగంగా సాగడం మానవాళి భవిష్యత్తుకే ముప్పుగా మారొచ్చంటూ ఇటీవల ఆందోళన వ్యక్తం చేసి ఆంథ్రోపిక్‌కు రాజీనామా చేశారు. అమెరికా ఏఐ సంస్థల్లో చైనాకు అనుకూలమైన వ్యక్తులకు అంతర్గత సమాచారం అందుబాటులో ఉంటే.. కీలక మోడళ్లను రహస్యంగా బయటకు తరలించే అవకాశం ఉందని కాక్సన్ హెచ్చరించారు. అమెరికా సాంకేతిక ఆధిక్యాన్ని చైనా ఎప్పుడైనా దెబ్బతీయగలదని పేర్కొన్నారు. అమెరికా ఏఐ రంగంలో విదేశీ గూఢచర్యంపై ఆందోళనలు ఇప్పటికే ఉన్నాయి. చైనా సంస్థలు అమెరికా అభివృద్ధి చేసిన ఏఐ మోడళ్లను 'డిస్టిలేషన్' పద్ధతిలో అనుకరిస్తున్నాయనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఇందులో పెద్ద ఏఐ మోడల్‌ను 'టీచర్'గా ఉపయోగించి చిన్న మోడల్‌కు శిక్షణ ఇస్తారు. అమెరికా రక్షణ సంస్థల్లో విదేశీ ఉద్యోగులపై కఠినమైన భద్రతా తనిఖీలు ఉంటాయని కాక్సన్ చెప్పారు. కానీ సిలికాన్ వ్యాలీలోని ఏఐ సంస్థల్లో ఇలాంటి తనిఖీలు తక్కువగా ఉన్నాయని ఆరోపించారు. ఉద్యోగుల నియామకంలో రక్షణ రంగ స్థాయి భద్రతా నిబంధనలు తీసుకురావాలని సూచించారు. అమెరికా-చైనా మధ్య ఏఐ పోటీ మరింత వేడెక్కుతోంది. సెప్టెంబరులో చైనాకు చెందిన 10 ప్రముఖ ఏఐ సంస్థలు 16 మోడళ్లను విడుదల చేసినట్లు నిక్కీ లెక్కలు చెబుతున్నాయి. అదే సమయంలో అమెరికా ప్రముఖ ఏఐ సంస్థలు 10-12 కొత్త మోడళ్లు, వేరియంట్లు, ప్రత్యేక రీజనింగ్ మోడళ్లను విడుదల చేశాయి.

## భారత్‌లో ఈవీ వాహనాల అమ్మకాల జోరు..

### సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో అమ్మకాలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

భారత ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) మార్కెట్ సరికొత్త శిఖరాలకు చేరింది. సెప్టెంబర్ నెలలో ఈవీ రిటైల్ విక్రయాలు ఆల్ టైమ్ రికార్డును సృష్టించాయి. ఈ ఒక్క నెలలోనే దేశవ్యాప్తంగా 3,33,634 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడవడం గమనార్హం. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే ఇది 74 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ గణాంకాలను ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ సమాఖ్య (ఫాడా) బుధవారం విడుదల చేసింది. ఈ గణాంకాలపై ఫాడా అధ్యక్షుడు సాయి గిరిధర్ స్పందిస్తూ, ఇది కేవలం గతేడాదితో పోల్చిన వృద్ధి మాత్రమే కాదని, ఒక సరికొత్త రికార్డు అని పేర్కొన్నారు. పండగ సీజన్ డిమాండ్, పెట్రోల్ ధరలతో పోలిస్తే తక్కువగా ఉన్న నిర్వహణ ఖర్చులు, మార్కెట్లోకి వస్తున్న కొత్త మోడళ్లు, పీఎం ఈ-డ్రైవ్ వంటి ప్రభుత్వ పథకాల ప్రోత్సాహం ఈ వృద్ధికి ప్రధాన కారణాలని ఆయన వివరించారు. ప్రస్తుతం ఈవీ మార్కెట్ కేవలం సబ్సిడీలపైనే కాకుండా, వినియోగదారుల డిమాండ్ ఆధారంగా పుంజుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా పరిశీలిస్తే, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విక్రయాలు 88.67 శాతం వృద్ధితో 2,07,314 యూనిట్లకు చేరాయి. అలాగే, ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్ల విక్రయాలు 94.56 శాతం పెరిగి 36,108 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ రెండు విభాగాల్లోనూ అమ్మకాలు ఆల్ టైమ్ హై స్థాయికి చేరడం విశేషం. ఇదే సమయంలో ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల విక్రయాలు 86,024 యూనిట్లుగా, కమర్షియల్ వాహనాల అమ్మకాలు 4,188 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ భారీ విక్రయాలతో దేశంలోని మొత్తం వాహన విక్రయాల్లో ఈవీల వాటా గతేడాది ఉన్న 10 శాతం నుంచి ప్రస్తుతం 13 శాతానికి పెరిగింది.

## శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయానికి నిధులు మంజూరు

### రూ.1108 కోట్లు

### మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

### ఆరుగురు సభ్యులతో నిపుణుల కమిటీ నియామకం

**హైదరాబాద్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

మూసీ ఒడ్డున శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. ఆలయ నిర్మాణంతో పాటు అనుసంధాన రహదారి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1108 కోట్ల మంజూరు చేసింది. ఆలయ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు డిజైన్లు ఖరారు చేసేందుకు ఆర్అండ్‌బీ ఇంజినీర్ ఇన్ ఛీఫ్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల ప్రత్యేక కమిటీని నియమించింది.మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవుల వద్ద నది ఒడ్డున శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయం పునర్నిర్మాణం, అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం రూ. 1108 కోట్లు మంజూరు చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో నదిని శుద్ధి చేసి మళ్లీ వినియోగంలోకి తీసుకురావడంతో పాటు పరిసరాల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని కూడా అభివృద్ధి చేసేలా ప్రభుత్వం ప్రణాళిక చేస్తోంది. అందులో భాగంగానే మంచిరేవుల వద్ద శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయనుంది.ఈ ఏడాది మార్చి 28న చరిత్రాత్మక, పురాతన శ్రీ వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధితో పాటు అనుసంధాన రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ఆర్కిటెక్చర్‌కు రూ. 599 కోట్లు సివిల్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ ఇతర పనులకు మరో రూ. 350 కోట్లు మంజూరు చేసింది. మంచిరేవులలోని ఇస్తానా విల్లాస్ నుంచి కీర్తి వెస్ట్ విండ్ విల్లాస్ వరకు (గ్రేహౌండ్స్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ పక్కనుంచి ఆలయానికి చేరుకునేలా రెండున్నర కిలోమీటర్లు ఆరు లేన్ల వందడుగుల రహదారి నిర్మించేందుకు మరో రూ. 160 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.శ్రీఓంకారేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి కోసం సాంకేతిక నిపుణుల కమిటీని కూడా ప్రభుత్వం నియమించింది. ఆర్అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఛైర్మన్‌గా, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఈ ఇన్ సీ కో ఛైర్మన్‌గా, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ కన్వీనర్‌గా ఉండే ఈ కమిటీలో దేవదాయ శాఖ సీఈ, ఆలయ నిర్మాణ నిపుణుడు శిల్పి డాక్టర్ ఇ.శివంగి రెడ్డి, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆలయ అభివృద్ధి కోసం సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు డిజైన్లు, ధరలను ఖరారు చేస్తుంది.

## 7,300 మెగావాట్ల హరిత ఇంధనం కొంటాం

### ఈఆర్‌సీ అనుమతి కోరిన డిస్కంలు

**హైదరాబాద్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

తెలంగాణ చరిత్రలో తొలిసారి భారీగా గ్రీన్ ఎనర్జీ కొనుగోలుకు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు సిద్ధమయ్యాయి. పెరుగుతున్న విద్యుత్? డిమాండ్‌ను తీర్చడంతోపాటు రెన్యువబుల్ ఎనర్జీ వినియోగ లక్ష్యాలను చేరుకునేందుకు వివిధ ప్రాజెక్టుల ద్వారా 7,300 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలిని కోరాయి.కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) ఇటీవల విడుదల చేసిన తెలంగాణ ఇంధన వనరుల అంచనాల ప్రకారం రాష్ట్ర కరెంటు వినియోగం ఈ ఏడాది (2026-27) 1,08,125 మిలియన్ యూనిట్ల నుంచి 2035-36 నాటికి 1,77,219 మిలియన్ యూనిట్లను చేరనుంది. ఇదే కాలంలో గరిష్ఠ డిమాండ్ 19,952 మెగావాట్ల నుంచి ఏకంగా 29,812 మెగావాట్లకు పెరగనుందని అంచనా వేశాయి. తెలంగాణలో 2035-36 నాటికి కరెంటు వినియోగ లోటు 61,630 మిలియన్? యూనిట్లు, గరిష్ఠ డిమాండు లోటు సుమారు 13 వేల మెగావాట్లకు చేరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తప్పనిసరిగా హరిత ఇంధనాన్ని కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని వివరించాయి.

# సీఎం చంద్రబాబును కలిసిన ఏషియన్ గేమ్స్ విజేతలు

**అమరావతి, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

2026 ఆసియా క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పతకాలు సాధించిన క్రీడాకారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా సత్కరించారు. నేడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విజేతలు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తిని చాటిచెప్పినందుకు వారిని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో క్రికెటర్ శ్రీచరణి, ఆర్చర్లు గణేశ్ మణిరత్నం, ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ ఉన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడాకారులు సాధించిన పతకాల వివరాలను శాప్ ఎండీ భరణి ముఖ్యమంత్రికి వివరించారు. మూడు వేర్వేరు క్రీడాంశాల్లో మన అథ్లెట్లు 3 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి మొత్తం 8 పతకాలను గెలుచుకున్నారని ఆయన తెలిపారు. ఈ విజయాల స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలతో పాటు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

**రాజమండ్రి, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. విచారణ తుది దశకు చేరుకున్న సమయంలో నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడం సరైన పద్ధతి కాదని, ముందుగా హైకోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. కేసు విచారణ అత్యంత వేగంగా సాగుతోందని, మొత్తం 87 మంది సాక్షుల్లో అత్యధికుల విచారణ ఇప్పటికే పూర్తయిందని ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేయడం సముచితం కాదని ఆయన తన వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, కేసులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. విచారణ గడువును మరో ఆరు నెలలు పొడిగించాలని అనంతబాబు భార్య చేసిన అభ్యర్థనను కూడా కోర్టు తోసిపుచ్చింది. ఈ సందర్భంగా పిటిషన్‌ను వెనక్కి తీసుకుని హైకోర్టును ఆశ్రయించాలని అనంతబాబు తరఫు న్యాయవాదులకు ధర్మాసనం సూచించింది. విచారణను రోజువారీ పద్ధతిలో కొనసాగించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో, వీడియో ఫైల్స్, డిజిటల్ ఆధారాలకు సంబంధించిన మరో అనుబంధ పిటిషన్‌ను కూడా పిటిషనర్ తరఫు వారు ఉపసంహరించుకున్నారు. గతంలో బెయిల్‌పై విడుదలైన అనంతబాబుకు... సాక్షులను బెదిరించారన్న ఆరోపణలతో బెయిల్ రద్దు కావడంతో ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు.

# కుమార్తె పెళ్లికి సీఎం విజయ్‌ను

## ఆహ్వానించిన వైఎస్ షర్మిల

**అమరావతి, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె వివాహ వేడుకకు ఆయన్ను ఆహ్వానించేందుకు షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నేడు చెన్నై వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం విజయ్‌ను నేరుగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వచ్చే నెల 25న తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని సీఎం విజయ్‌ను సాదరంగా కోరారు. ఈ సమావేశం అనంతరం షర్మిల సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. తమకు సమయం కేటాయించిన సీఎం విజయ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆయన చూపిన ఆప్యాయత, అనురాగం ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాబోయే దంపతులకు సీఎం విజయ్ తన శుభాకాంక్షలు తెలియజేసినట్లు వైఎస్ షర్మిల వివరించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఢిల్లీలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

## ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో భేటీ చాన్స్

**అమరావతి, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి పయనమయ్యారు. ఈరోజు మధ్యాహ్నం ఆయన హస్తినకు చేరుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన చర్చించనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి, ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో భేటీ కానున్నారు. ప్రధానంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు తక్షణ ఆమోదం తెలపాలని ఆయన ప్రధానిని కోరనున్నారు. అలాగే, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితుల దృష్ట్యా సహాయక చర్యల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేయనున్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్రం నుంచి అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిపే చర్చల్లో ముఖ్యమంత్రి ప్రస్తావించనున్నారు. గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళుతున్న మిగులు జలాల సద్వినియోగం, నదుల అనుసంధానం ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం చేయించడం వంటి అంశాలను కేంద్ర జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా రేపు మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించే 'భాగస్వామ్య సదస్సు' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం రేపు రాత్రికి ఆయన ఢిల్లీ నుంచి తిరిగి అమరావతికి బయలుదేరనున్నారు.

# రాష్ట్రంలో ప్రైవేటు బస్సుల యజమానులకు గుడ్‌న్యూస్!

## త్వరలో భారీగా తగ్గనున్న రిజిస్ట్రేషన్ ఫీజులు

**హైదరాబాద్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

రాష్ట్రంలో ప్రైవేటు బస్సుల 'వలస' రిజిస్ట్రేషన్లను ఆపేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. అధిక ట్యాక్స్?ల భారంతో ఈశాన్య, ఇతర రాష్ట్రాల పేరుతో నడుస్తున్న బస్సుల రిజిస్ట్రేషన్‌ను 'టీజీ' బాట పట్టించేవిధంగా అధికారుల కమిటీ పలు కీలక సిఫార్సులను చేసింది. 12 సీట్లకు పైబడిన కాంట్రాక్ట్ క్యారేజెస్(ప్రైవేటు బస్సులు) ఆయా బస్సుల్లో ఒక్కో సీటుకు ప్రస్తుతం రాష్ట్ర మోటారు వాహన పన్ను(తెలంగాణ మోటార్ వెహికల్ ట్యాక్స్) కింద ప్రతి త్రైమాసికానికి(మూడు నెలలు) పన్ను రూ.4 వేలు ఉండగా, రూ.1,800కి తగ్గించాలని సూచించింది. ఈ మేరకు ఇందుకు సంబంధించిన ప్రతిపాదన ప్రభుత్వానికి మంగళవారం వెళ్లింది.హైదరాబాద్ నగరం నుంచి పొరుగు రాష్ట్రాల్లోని నగరాలకు నిత్యం వందల సంఖ్యలో బస్సులు వెళుతుంటాయి. ఆయా బస్సులను ఓనర్లు మోటారు వాహన పన్ను స్వల్పంగా ఉన్న రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. 2020-21 నుంచి 2025-26 మధ్య కాలంలో తెలంగాణకు చెందిన 123 ప్రైవేటు బస్సుల రిజిస్ట్రేషన్ ఇతర రాష్ట్రాల్లో జరిగింది. అందులో సగానికిపైగా నాగాలాండ్‌లోనే ఉండడటమనేది గమనార్హం. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి త్రైమాసిక పన్నుతో ఆదాయం ఏటా పెరగాల్సిందిపోయి క్రమంగా తగ్గుతూ వచ్చింది. బస్సుల సంఖ్య 233 నుంచి 110కి పడిపోవడంతో తెలంగాణ ఆదాయానికి గండి పడింది.ఈ నేపథ్యంలో త్రైమాసిక పన్ను(మూడు నెలల పన్ను) రూ.1,800కి తగ్గిస్తే తొలుత ఆదాయ నష్టం వచ్చినప్పటికీ ఆ తర్వాత పెరుగుతుందని రవాణాశాఖ అధికారుల కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుతం 110 బస్సులపై సుమారు రూ.4.81 కోట్ల వార్షిక ఆదాయం ఉండగా, పన్ను రూ.1,800కు తగ్గించినట్లితే ఇది సుమారు రూ.2.14 కోట్లకు తగ్గుతుంది. అయితే తక్కువ పన్ను విధానంతో స్వల్పకాలంలోనే 'టీజీ' రిజిస్ట్రేషన్ బస్సుల సంఖ్య 300కి చేరుకుని వార్షిక ఆదాయం రూ.5.83 కోట్లకు, మీడియం టర్మ్‌లో 500 బస్సులతో రూ.9.72 కోట్లు దీర్ఘకాలంలో 10,000 బస్సులతో రూ.19.44 కోట్ల ఆదాయం వస్తుంది.. అంటే రూ.14.63 కోట్ల ఆదాయం పెరుగుతుందని అధికారుల కమిటీ ప్రభుత్వానికి వివరించింది.

# ఈసి నియామకాల తీర్పు రికాల్‌పై పిటిషన్

## పిటిషన్ ను స్వీకరించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

సీఈసీ, ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకానికి సంబంధించిన 2023 చట్టంపై దాఖలైన పిటిషన్ల విషయంలో సుప్రీంకోర్టులో కీలక పరిణామం జరిగింది. ఈ అంశంపై సెప్టెంబర్ 23న వెలువడిన భిన్నమైన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది.ప్రధాని, లోక్‌సభ విపక్ష నేత, సీజేఐలతో కూడిన కమిటీ చేసే సిఫార్సుపై సీఈసీ, ఈసీల నియామకాలను రాష్ట్రపతి చేస్తారని 2023 మార్చి 2న ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. సీజేఐ బదులు కేంద్ర మంత్రికి అవకాశమిస్తూ ఆ ఏడాది డిసెంబరులో పార్లమెంటులో చట్టాన్ని రూపొందించడంతో దాని రాజ్యాంగబద్ధ చెల్లుబాటును పలువురు సవాల్ చేశారు. ఈ పిటిషన్లను విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలా? అనే అంశంపై సెప్టెంబర్ 23న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే ఈ అంశంపై ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ఫలితంగా భిన్నమైన తీర్పులు వెలువడ్డాయి. ఈ కేసును మరింత విస్తృతమైన రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలని కేంద్రం కోరింది. అయితే జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ అభ్యర్థనను తిరస్కరించారు. ఎంపిక కమిటీలో ఒక క్యాబినెట్ మంత్రిని చేర్చడం వల్ల దాని తటస్థ స్వరూపం పోతుంది. 2023 చట్టం కార్యనిర్వాహక వర్గానికి ఎక్కువ అధికారాన్ని కట్టబెడుతుందని అభిప్రాయపడ్డారు. విపక్ష నేత ఉనికి నామమాత్రం అవుతుందని, కమిటీలో ఆయనను చేర్చిన ఉద్దేశం అలంకారప్రాయంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. కానీ, జస్టిస్ దత్తా వ్యాఖ్యను వ్యతిరేకిస్తూ, కేంద్ర వాదనను జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ మాత్రం ఏకీభవించారు. ఆర్టికల్ 145(3) ప్రకారం ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం అధికారికంగా నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై విస్తృత ధర్మాసనం పరిశీలించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో తదుపరి చర్యల కోసం ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వద్దకు పరిపాలనా పరంగా పంపాలని ద్విసభ్య ధర్మాసనం నిర్ణయించింది. తగిన సంఖ్యలో న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి, అంశంపై సమర్థవంతమైన, తుది నిర్ణయం తీసుకునేలా చేయాలని సూచించింది.

# ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ పరిధిలో భారీ మార్పులు

## కొత్తగా 2 పోలీస్‌స్టేషన్లు, 3 శాంతి భద్రతల డివిజన్లు ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్?సిటీ పోలీస్? కమిషనరేట్? పరిధిలో భారీ మార్పులు చేపట్టింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ తర్వాత ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ పరిధిలో మార్పులు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. 3 కొత్త శాంతి భద్రతల డివిజన్లు, 2 కొత్త పోలీస్? స్టేషన్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది.దీంతోపాటు రెండు ట్రాఫిక్ జోన్లుగా ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్‌ను పునర్వ్యవస్థీకరించింది. 3 ట్రాఫిక్ డివిజన్లు, 3 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసింది. అబ్దుల్లాపూర్?మెట్? పీఎస్?ను ఫ్యూచర్? సిటీ కమిషనరేట్? పరిధిలోని మహేశ్వరం జోన్?లోకి మార్చింది. మొయినాబాద్?, ఆమనగల్?, కొత్తూరు పేర్లతో కొత్త శాంతిభద్రతల డివిజన్లను ఏర్పాటు చేసింది. అజీజ్‌నగర్‌లో కొత్త పీఎస్, మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల పేర్లతో 3 కొత్త ట్రాఫిక్ డివిజన్లు ఏర్పాటు చేసింది. శంషాబాద్? పోలీస్?స్టేషన్? పేరును పెదషాపూర్?గా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఠాణా పరిధిలోని కొన్ని ప్రాంతాలూ మారాయి. పెదషాపూర్? స్టేషన్?ను షాద్?నగర్? జోన్? కొత్తూరు డివిజన్?, షాద్?నగర్? జోన్? పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో శంషాబాద్, ఆర్జీఐఏ పేర్లతో రెండు పీఎస్‌లు ఉండేవి. ఇప్పుడు ఆర్జీఐఏ పీఎస్‌ను శంషాబాద్‌గా పేరు మార్చింది. గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌ను మీర్‌ఖాన్‌పేట్ పీఎస్‌గా మార్చింది.ఫ్యూచర్‌సిటీలో ఉన్న ట్రాఫిక్ జోన్‌ను ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 పేర్లతో రెండు ట్రాఫిక్ జోన్లుగా ఏర్పాటు చేసింది. మొయినాబాద్, కొత్తూరు, ఆమనగల్ పేర్లతో 3 కొత్త ట్రాఫిక్ పీఎస్‌లు ఏర్పాటు చేసింది. షాబాద్, మొయినాబాద్, అజీజ్‌నగర్ ఠాణాలు మొయినాబాద్ ట్రాఫిక్ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.నూతనంగా అజీజ్‌నగర్ ఠాణా ఏర్పాటైంది. మొయినాబాద్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను ఈ ఠాణా పరిధిలోకి తీసుకొచ్చారు. జోన్?కు ఒకటి చొప్పున మహేశ్వరం, చేవెళ్ల, షాద్?నగర్? పేర్లతో మూడు మహిళా పోలీస్?స్టేషన్లకు అంకురార్పణ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా ప్రస్తుతం మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ఉంది. దాన్ని ఫ్యూచర్‌సిటీ పరిధిలోని మహేశ్వరం జోన్‌లోకి తీసుకొచ్చింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధి పూర్తిగా మారింది. గ్రీన్? ఫార్మాసిటీ పోలీస్?స్టేషన్?కు మీర్?ఖాన్?పేటగా పేరు పెట్టారు.

# 'రోడ్ డస్ట్' నియంత్రణకు ప్రత్యేక దృష్టి

- సమన్వయంతో స్వచ్ఛ వాయు లక్ష్య సాధనకు టిజిపిసిబి కృషి
- కాలుష్య మూలాల నిర్మూలనే లక్ష్యంగా విస్తృత కార్యక్రమాలు
- వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ మరింత బలోపేతం
- ప్రజా రవాణాలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం పెంపు
- స్వచ్ఛ వాయు సర్వేక్షణలో తెలంగాణకు గుర్తింపు
- టిజిపిసిబి మెంబర్ సెక్రటరీ రవి వెల్లడి
- వాయు నాణ్యత మెరుగుదలకు శాస్త్రీయ పర్యవేక్షణ, సమగ్ర కార్యాచరణ
- కాలుష్య మూలాల నియంత్రణకు ప్రభావవంతమైన చర్యలు
- కాలుష్య మూలాల నియంత్రణపై సెక్రటేరియట్‌లో సమావేశం

**హైదరాబాద్, అక్టోబర్ 07(తెలంగాణ వీణ):**

తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ, వాయు నాణ్యత మెరుగుదల కోసం ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి(ఎక్యుఎంసి) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ అన్నారు. శాస్త్రీయ పర్యవేక్షణ, కాలుష్య మూలాల గుర్తింపు, నియంత్రణ చర్యలు, పచ్చదనం పెంపు, ప్రజా అవగాహన కార్యక్రమాలతో కూడిన సమగ్ర కార్యాచరణను కొనసాగిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ రోజు సెక్రటేరియట్ లో కమిటి ఛైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ గారి ఆధ్వర్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ రవి గారు కమిటి మెంబర్ కన్వీనర్ గా నిర్వహించిన ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి సమావేశం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ఆమోదించిన ఎక్యుఎంసి కార్యాచరణ ప్రణాళికలోని అంశాల పై చర్చించింది. సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్, ఎన్‌క్యాప్ నోడల్ ఆఫీసర్ ప్రసాద్, జీహెచ్ఎంసి, సైబరాబాద్ మల్కాజ్గిరి కార్పొరేషన్ల కమిషనర్లు, నల్గొండ కలెక్టర్, సిడిఎంఎ అధికారులు, ట్రాన్స్పోర్ట్ కమిషనర్, టిజిఎస్ ఆర్ టిసి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి ట్రాఫిక్ కమిషనరేట్ల అధికారులు, టిజి ఐఐసి, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన కార్యక్రమాల పై చర్చించిన తర్వాత ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, ఫలితాలను సమావేశం విశ్లేషించింది. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద ఎక్యుఎంసి చేపడుతున్న కార్యక్రమాలను సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ ప్రసాద్ కమిటి ఛైర్మన్ అహ్మద్ నదీమ్, టిజిపిసిబి మెంబర్ సెక్రటరీ, కమిటి మెంబర్ కన్వీనర్ రవి, కమిటి సభ్యులకు వివరించారు. వాయు నాణ్యతను మరింత ఖచ్చితంగా, నిరంతరంగా పర్యవేక్షించేందుకు 13 'నిరంతర పరిసర వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతున్నది. పర్యవేక్షణ కేంద్రాల స్థానాలను శాస్త్రీయంగా నిర్ణయించి, ఆయా ప్రాంతాల్లోని వాయు నాణ్యతకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని పొందేలా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. డేటాను సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావడానికి "ఎయిర్ క్వాలిటి డ్యాష్ బోర్డు" అభివృద్ధి ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. సంబంధిత శాఖలకు అలర్ట్ ల ద్వారా వాయు నాణ్యతకు సంబంధించిన సమాచారం చేరవేస్తారు. అదేవిధంగా తక్కువ వ్యయంతో వాయు నాణ్యతను పర్యవేక్షించే 'లో కాస్ట్ సెన్సార్ల వినియోగాన్ని కూడా విస్తరిస్తున్నారు. టిజిపిసిబి ఆధ్వర్యంలో బొల్లారం, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇప్పటికే 8 ఎల్సిఎస్ లను ఏర్పాటు చేశారు. రీసైక్లింగ్, క్రషింగ్ తదితర కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో, అలాగే నిర్మాణ, కూల్చివేత ప్రదేశాల్లో ఎల్సిఎస్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.పట్టణ వాయు కాలుష్యంలో ధూళికణాల కాలుష్యాన్ని నియంత్రించేందుకు రోడ్ డస్ట్ నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. రోడ్ల మెరుగుదల, ఎండ్-టు-ఎండ్ పేవింగ్, మెకానికల్ రోడ్ స్వీపింగ్, బహిరంగ ప్రాంతాల్లో పచ్చదనం పెంపుదల, ట్రాఫిక్ కారిడార్లలో గ్రీన్ కవర్, మినీ ఫారెస్టులు, మియావాకీ ప్లాంటేషన్లు వంటి చర్యలను నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌క్యాప్) కింద చేపడుతున్నారు.మెకానికల్ రోడ్ స్వీపింగ్‌పై టిజిపిసిబి నిర్వహించిన అధ్యయన ఫలితాలను మూడు పట్టణ స్థానిక సంస్థల అధికారులకు వివరించేందుకు వర్క్ షాప్ నిర్వహించగా, సుమారు 100 మంది అధికారులు పాల్గొన్నారు. అధ్యయన సిఫారసులను రాబోయే సర్వీస్ ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోనున్నారు. వాహనాల ఉద్గారాలను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, పీయూసి వ్యవస్థ బలోపేతం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ వాహనాల కొనుగోలు, అద్దెకు తీసుకునే వాహనాల్లో ఈవీ లకు ప్రాధాన్యత కల్పించే చర్యలు అమలయ్యాయి. పీయూసి వ్యవస్థను మరింత సమర్థవంతం చేసేందుకు రాష్ట్రంలోని 516 పీయూసి కేంద్రాలను కేంద్ర సర్వర్‌తో అనుసంధానం చేశారు. ఇప్పటివరకు 36,14,208 పరీక్షలు నిర్వహించినట్లు రవాణా శాఖ నివేదించింది. పీయూసి గడువు ముగిసిన వాహనాలపై ఆటోమేటిక్ చలాన్ల విధానం అమలు చేసేందుకు వాహనాల నంబర్ ప్లేట్లను స్వయంచాలకంగా గుర్తించే కెమెరాల ఏర్పాటుకు కూడా చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా రంగంలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచే చర్యలు కొనసాగుతున్నాయి. ఆర్టీసి ప్రస్తుతం జీహెచ్ఎంసి పరిధిలో 310 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతోంది. అదనంగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్రానికి కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. నల్గొండ, సంగారెడ్డి ప్రాంతాల్లో వాయు కాలుష్యానికి కారకమవుతున్న వివిధ మూలాలను శాస్త్రీయంగా గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఐఐటీ బాంబే సమర్పించిన డ్రాఫ్ట్ తుది నివేదికను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా మరింత మెరుగుపరచేందుకు టిజిపిసిబి, ఇతర నిపుణ సంస్థలు సూచనలు అందించాయి. ఈ అధ్యయన ఫలితాలను భవిష్యత్ కాలుష్య నియంత్రణ చర్యలకు ఉపయోగించనున్నారు. తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ కోసం స్టేట్ యాక్షన్ ప్లాన్ ను మరింత శాస్త్రీయంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి యునైటెడ్ నేషన్ ఎన్విరాన్ మెంట్ ప్రోగ్రామ్ తో కలిసి ఉద్గారాల సమగ్ర లెక్కింపు పై చర్యలు చేపడుతున్నది. వివిధ శాఖల నుంచి అమలు నివేదికలను సేకరించి, రాష్ట్ర స్థాయి కార్యాచరణను మరింత సమర్థవంతంగా రూపొందించే ప్రక్రియ కొనసాగుతున్నది. అన్ని జిల్లాలకు జిల్లా స్థాయి అమలు కమిటీల పరిధిని విస్తరించే చర్యలు కూడా ప్రతిపాదనలు సమర్పించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో వాయు నాణ్యత పర్యవేక్షణను బలోపేతం చేయడంతో పాటు, నిర్మాణ ప్రాంతాలు, ఇతర ప్రధాన కాలుష్య ఉత్పత్తి ప్రాంతాల్లో పర్యవేక్షణకు సెన్సార్ వ్యవస్థలను విస్తరిస్తున్నారు. డీజిల్ జనరేటర్ సెట్ల నుంచి వెలువడే ఉద్గారాలను నియంత్రించేందుకు ఉద్గార నియంత్రణ పరికరాల అదనపు అమరిక లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సంబంధిత సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు, విద్యుత్ శాఖల సమన్వయంతో అమలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ అవశేషాలను బహిరంగంగా దహనం చేయడం వల్ల వాయు కాలుష్యం పెరగకుండా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ అవశేషాలను బ్రికెట్లు, పెల్లెట్లుగా మార్చి సంప్రదాయ ఘన ఇంధనాలకు ప్రత్యామ్నాయ ఇంధనంగా వినియోగించే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బ్రికెట్ తయారీ యూనిట్ల ఏర్పాటు ఇప్పటికే ప్రారంభమైంది. 15వ ఫైనాన్స్ కమిషన్ కింద విడుదలైన నిధులను నిర్దేశిత వాయు కాలుష్య నియంత్రణ చర్యలకు సమర్థవంతంగా వినియోగించడంపై ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి ప్రత్యేకంగా సమీక్షించింది. హైదరాబాద్‌లో కింద విడుదలైన నిధుల్లో 90.27 శాతం, నల్గొండలో 82.5 శాతం, పటాన్‌చెరులో 100 శాతం, సంగారెడ్డిలో 76.43 శాతం వినియోగమైనట్లు సమీక్షలో వెల్లడైంది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణలో నల్గొండకు రూ.4.83 కోట్లు, సంగారెడ్డికి రూ.2.42 కోట్లు, మొత్తం రూ.7.25 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో రహదారుల మెరుగుదల, పచ్చదనం, ఎలక్ట్రిక్ క్రిమేటోరియంలు తదితర వాయు నాణ్యత మెరుగుదల చర్యలకు వార్షిక కార్యాచరణ ప్రణాళికలు టిజిపిసిబి సిద్ధం చేసింది.



# నా వైఫ్ మిస్సింగ్ టీజర్ రిలీజ్

ఎప్పటికప్పుడు ఎగ్జైటింగ్ కంటెంట్ తో సబ్ స్క్రైబర్స్ ను ఎంగేజ్ చేస్తోన్న ఆహా ఓటీటీ ఇప్పుడు మరో ఎగ్జైటింగ్ సిరీస్ ను మన ముందుకు తీసుకొస్తోంది. వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రధాన పాత్రల్లో ఆహా ఒరిజినల్ నా వైఫ్ మిస్సింగ్ ఈ నెల 22వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. ఈ సిరీస్ తెలుగుతో పాటు తమిళంలోనూ సబ్ స్క్రైబర్స్ కు అందుబాటులో ఉండనుంది. నా వైఫ్ మిస్సింగ్ సిరీస్ ను లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్ పై శివ కంఠంనేని నిర్మించారు. స్వాతిప్రకాష్ మంత్రిప్రగడ దర్శకత్వం వహించారు. ఈ రోజు నా వైఫ్ మిస్సింగ్ టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే -- పెద్దలు కుదిర్చిన సంబంధంతో వైవాహిక జీవితంలోకి అడుగుపెడతారు వరుణ్, శ్వేతా. వారి దాంపత్య జీవితం సంతోషంగా సాగుతూ ఉంటుంది. కానీ టీజర్ లో పెళ్లిచూపుల సమయంలోనే తను వర్జిన్ కాదు అని హీరోయిన్ చెప్పడంతో హీరో షాక్ కు గురైనట్లు చూపించారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్ లో తన వైఫ్ మిస్ అయినట్లు వరుణ్ కంప్లైంట్ ఇవ్వడం క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. పెళ్లి చూపుల సమయంలో శ్వేత చెప్పింది నిజమేనా, ఆమె మిస్సింగ్ కు కారణాలు ఏంటి, వరుణ్ పోలీసుల సహాయంతో తన భార్య ఎక్కడుందో తెలుసుకోగలిగాడా అనే ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ తో టీజర్ ఆకట్టుకుంటోంది. కొత్త బంగారు లోకం సినిమాతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ జంట.. ఇప్పుడు మరోసారి వెండితెరపై కలిసి కనిపించేందుకు సిద్ధమవుతోంది. కొత్త బంగారు లోకంలో వీరిద్దరి కెమిస్ట్రీ అప్పట్లో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్యంగా యువతకు ఈ జోడీ బాగా కనెక్ట్ కావడంతో, వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్‌లకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. చాలా కాలం తర్వాత ఈ ఇద్దరూ మరోసారి ఒకే సినిమాలో కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# సక్సెస్ మాత్రం అందుకోలేక పోతున్నారు



పాయల్ రాజ్‌పుత్‌కు ఆఫర్లు తగ్గాయా? ఒకే ఒక్క సినిమాతో స్టార్‌గా మారి.. ఇప్పుడు మళ్లీ గట్టిగా ప్రయత్నిస్తున్న ఈ హీరోయిన్ తెలుగు సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు పాయల్ రాజ్‌పుత్. అందం, గ్లామర్‌తో పాటు నటనతోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. కెరీర్ ప్రారంభంలోనే భారీ సక్సెస్‌ను అందుకుంది. అయితే ఆ తర్వాత అదే స్థాయిలో వరుస విజయాలను అందుకోలేకపోయింది. దీంతో ఒకప్పుడు వరుస అవకాశాలతో బిజీగా కనిపించిన పాయల్.. ఇప్పుడు ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటోంది. పాయల్ రాజ్‌పుత్ కెరీర్‌ను 'ఆర్ 100'కు ముందు.. ఆ తర్వాత అని చెప్పుకోవచ్చు. 2018లో అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా సంచలన విజయాన్ని అందుకోవడంతో పాయల్ ఒక్కసారిగా టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో ఆమె పోషించిన ఇందు పాత్ర ప్రేక్షకులపై బలమైన ముద్ర వేసింది. ముఖ్యంగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో పాయల్ చూపించిన నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. పాయల్ కూడా పలుమార్లు 'ఆర్ 100' తన జీవితాన్ని మార్చేసిన సినిమా అని చెప్పుకొచ్చింది. 'ఆర్100' తర్వాత పాయల్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే ఆ తర్వాత వచ్చిన సినిమాలు మాత్రం ఆమెకు ఆశించిన స్థాయిలో విజయాలను అందించలేకపోయాయి. 'సీత', 'ఆర్ డీ ఎక్స్ లవ్', 'వెంకీ మామ', 'డిస్కో రాజా', 'అనగనగా ఓ అతిథి', 'తీస్ మార్ ఖాన్', 'జిన్నా', 'మయా పేటిక', 'రక్షణ' వంటి చిత్రాల్లో నటించినప్పటికీ.. 'ఆర్ ఎక్స్ 100' స్థాయి ఇంపాక్ట్ మాత్రం మరోసారి రాలేదు. ఆర్ 100 తర్వాత పాయల్‌కు మరోసారి బలమైన గుర్తింపు తీసుకొచ్చిన సినిమా 'మంగళవారం'. అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో శైలుగా ఆమె చాలా విభిన్నమైన పాత్రను పోషించింది. ఈ పాత్ర కోసం మానసికంగా, భావోద్వేగంగా చాలా కష్టపడాల్సి వచ్చిందని పాయల్ స్వయంగా చెప్పింది. 'మంగళవారం' తన కెరీర్‌లో మరో ముఖ్యమైన చిత్రంగా నిలిచింది. ఈ సినిమా ద్వారా తాను కేవలం గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాదని పాయల్ నిరూపించుకునే ప్రయత్నం చేసింది. కానీ స్టార్ హీరోయిన్ స్థాయిలో వరుసగా భారీ కమర్షియల్ సినిమాలు, పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం మాత్రం తగ్గింది. దీనిపై గతంలో పాయల్ కూడా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. 'ఆర్100'లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేయడం వల్ల ప్రేక్షకులు, దర్శకులు తనను అదే తరహా పాత్రల్లో ఊహించి ఉండొచ్చని ఆమె అభిప్రాయపడింది. తాను అన్ని రకాల పాత్రలు చేయాలను కుంటున్నానని, ఇంకా తనకు చాలా దూరం వెళ్లాల్సి ఉందని చెప్పింది. రీసెంట్ గా లీడర్ అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది.




# 'ఫౌజీ' కంటే ముందు స్పిరిట్..

ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్, రెబల్ స్టార్ ప్రభాస్ చేతిలో నాలుగు సినిమాలు ఉన్నాయి. వాటిలో 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాల చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. అయితే... ఆ సినిమాల విడుదల విషయంలో కాస్త కన్‌ఫ్యూజన్ నెలకొంది. దానికి ప్రభాస్ తెర దించినట్టు తెలిసింది. థియేటర్లలోకి 'ఫౌజీ' కంటే ముందు 'స్పిరిట్'ను తీసుకు రావాలని ప్లాన్ చేశారట. హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న సినిమా 'ఫౌజీ'. తొలుత ఈ ఏడాది (2026) డిసెంబర్ మొదటి వారంలో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. కానీ, ఆ తేదీకి సినిమా రావడం కష్టమని చిత్ర నిర్మాతలలో ఒకరైన 'మైత్రీ మూవీ మేకర్స్' రవిశంకర్ యలమంచిలి తెలిపారు. దాంతో ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్' విడుదల సైతం వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని ఫిల్మ్ నగర్ సర్కిళ్ళలో వినిపించింది. ఎందుకంటే... ఆ సినిమాను వచ్చే ఏడాది (2027) మార్చి 5న విడుదల చేయడానికి ప్లాన్ చేశారు. డిసెంబర్ నెలలో రావాల్సిన 'ఫౌజీ' రెండు మూడు నెలలు వెనక్కి వెళితే... మార్చి 2027లో విడుదలకు సిద్ధమవుతున్న 'స్పిరిట్' కూడా వెనక్కి వెళుతుందని ట్రేడ్ వర్గాలు భావించాయి. అయితే... 'ఫౌజీ' లేటైనా సరే 'స్పిరిట్' లేట్ కాకూడదని, హను రాఘవపూడి సినిమా కంటే ముందు సందీప్ రెడ్డి వంగా సినిమాను రిలీజ్ చేయాలని ప్రభాస్ డిసైడ్ అయ్యారట. అదీ సంగతి. తన కెరీర్‌లో 24వ సినిమా అనుకున్న 'ఫౌజీ'ని వెనక్కి తీసుకు వెళ్లి... 25వ సినిమా అనుకున్న 'స్పిరిట్'ను ప్రభాస్ ముందుకు తీసుకు వస్తున్నారన్నమాట. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్'ను ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారమే షూట్ చేస్తున్నారు. కానీ, హను రాఘవపూడి దర్శకత్వంలోని 'ఫౌజీ' చిత్రీకరణ ఇంకా పూర్తి కాలేదు. అది సాగుతూ వెళుతోంది. అందువల్ల, వచ్చే ఏడాది వేసవి తర్వాత థియేటర్లలోకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నారట.

# అక్టోబర్ 23న రాధిక 'డెలివరీ బాయ్' రిలీజ్

రాధిక శరత్ కుమార్, లియో శివకుమార్, బ్రిగిడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ చిత్రం 'డెలివరీ బాయ్' విడుదల తేదీ ఖరారైంది. నాని దర్శకత్వం వహిస్తున్న ఈ ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను ఈ ఏడాది అక్టోబర్ 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ప్రముఖ మ్యూజిక్ లేబుల్ 'సరిగమ తమిళ్' తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా విడుదల తేదీ పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమా కథాంశం గురించి దర్శకుడు నాని గతంలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "తల్లిని కాపాడుకోవడం కోసం ఓ డెలివరీ బాయ్ చేసే ప్రయత్నమే ఈ సినిమా కథ. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన హీరో, తన తల్లిని రక్షించుకోవడానికి ఎలాంటి పోరాటం చేశాడనేది ఉత్కంఠభరితంగా ఉంటుంది. సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేస్తుంది" అని ఆయన వివరించారు. గతేడాది డిసెంబర్‌లోనే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. చెన్నై, కోయంబత్తూర్‌లలో కేవలం 42 రోజుల వ్యవధిలోనే మొత్తం చిత్రీకరణను ముగించడం విశేషం. షూటింగ్ పూర్తయిన వెంటనే డబ్బింగ్ సహా పోస్ట్-ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేశారు. ఈ చిత్రంలో దుష్యంత్, కాళీ వెంకట్, బోస్ వెంకట్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అశాని క్రియేషన్స్ పతాకంపై అముత లియోనీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సుందరమూర్తి సంగీతం అందిస్తుండగా, ప్రసన్న కుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నంద మణి వాసగం సంభాషణలు, వసంత్ ఎడిటింగ్ అందిస్తున్నారు.




# 50 కోట్ల క్లబ్బులో 'మందాడి'




తమిళంలో హాస్య నటుడిగా కెరీర్ ప్రారంభించి, తర్వాత కథానాయకుడిగా మారిన నటుడు సూరి. తెలుగులో యూట్యూబ్ ఫిలిమ్స్ నుంచి కెరీర్ స్టార్ట్ చేసి, తర్వాత సినిమాల్లో హీరోగా స్నేహితుడి పాత్రలు చేసి, ఆ తర్వాత హీరోగా మారిన నటుడు సుహాస్. వీళ్ళిద్దరూ కలిసి నటించిన సినిమా 'మందాడి'. మందాడి'లో సూరి హీరోగా, సుహాస్ విలన్‌గా నటించారు. ఈ చిత్రాన్ని ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ పతాకంపై ఎల్రెడ్ కుమార్ నిర్మించారు. మతిమారన్ పుగళేంది దర్శకుడు. సూరి సరసన మహిమా నంబియార్ కథానాయికగా నటించగా... సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ ఇతర కీలక పాత్రలు పోషించారు. కలెక్షన్స్ పరంగా ఈ సినిమా సరికొత్త రికార్డులు క్రియేట్ చేసింది. బాక్స్ ఆఫీస్ బరిలో 'మందాడి' సినిమా 150 కోట్ల రూపాయలు కలెక్ట్ చేసింది. ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సెప్టెంబర్ 10న విడుదల చేసింది. తెలుగులో మంచి స్పందన అందుకుంది. తమిళనాడు బాక్స్ ఆఫీస్ లెక్కలు చూస్తే... కొత్త రికార్డులను క్రియేట్ చేసింది. తమిళ, తెలుగు రాష్ట్రాలతో పాటు విడుదల చేసిన అన్ని ఏరియాలలో 'మందాడి'కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటి వరకు తమిళనాడులో వంద కోట్లకు పైగా గ్రాస్ కలెక్ట్ చేసింది. ప్రపంచ వ్యాప్తంగా రూ. 150 కోట్లకు పైగా గ్రాస్ కలెక్ట్ చేసింది. అటు సూరి, ఇటు సుహాస్... ఇద్దరి కెరీర్‌లలో 'మందాడి' బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. 'మందాడి'లోని బోట్ సీక్వెన్స్, రేసింగ్ సన్నివేశాలకు థియేటర్లలో విజిల్స్ పడ్డాయి. ఈ చిత్రానికి కథిర్ విజువల్స్, జీవీ ప్రకాష్ సంగీతం, పీటర్ హెయిన్ - దిలీప్ సుబ్బరాయన్ - మహేష్ మాథ్యూ యాక్షన్ సీక్వెన్స్ హైలెట్‌గా నిలిచాయి. సూపర్ స్టార్ రజనీకాంత్, కమల్ హాసన్ సహా పలువురు తమిళ సెలబ్రిటీలు ఈ సినిమాపై ప్రశంసల జల్లు కురిపించారు. ఈ చిత్రానికి మణికందన్ సహ నిర్మాత.

తెలంగాణవీణ
నిజం నిగ్గు తేలుస్తాం..
08 శుక్రవారం అక్టోబర్ 2026
www.epaper.telanganaveena.in


# 18 స్థానాలు ఎగబాకిన శ్రేయస్ అయ్యర్

## కెరీర్ బెస్ట్ 7వ ర్యాంక్ సాధించిన అయ్యర్



ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకోగా, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో అద్భుత శతకం సాధించిన శ్రేయస్ అయ్యర్, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 7వ స్థానంలో నిలిచాడు. నిన్న జరిగిన ఆ మ్యాచ్‌లో శ్రేయస్ కేవలం 43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు. ఈ ప్రదర్శనతో అతను టీ20ల్లో భారత్ తరపున మూడో అత్యుత్తమ ర్యాంకు బ్యాటర్‌గా నిలిచాడు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్ (1), అభిషేక్ శర్మ (2) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. తిలక్ వర్మ 10వ స్థానంలో ఉన్నాడు. దీంతో టీ20 బ్యాటింగ్ టాప్-10లో నలుగురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. మరోవైపు వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్, తన కెరీర్‌లోనే అత్యధికంగా 841 రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. విజయవంతమైన వన్డే ఛేదనలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. ఇదే జాబితాలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి మూడో ర్యాంకుకు పడిపోయాడు. అదే సిరీస్‌లో అజేయ శతకం (129) బాదిన వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తిరిగి టాప్-10లోకి ప్రవేశించాడు. బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్థాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌ను వెనక్కి నెట్టి రషీద్ 8వ సారి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు. టీ20 చరిత్రలో మరే బౌలర్ కన్నా ఎక్కువ కాలం నం.01గా నిలిచిన బౌలర్‌గా రషీద్ రికార్డు సృష్టించాడు. భారత స్పిన్ ఆల్-రౌండర్ అక్షర్ పటేల్ గత మూడు మ్యాచ్‌ల్లో నిలకడగా రాణించి 16 స్థానాలు మెరుగుపరచుకుని 7వ ర్యాంకుకు చేరుకున్నాడు.ఇతర ఆటగాళ్లలో వెస్టిండీస్ వన్డే కెప్టెన్ షాయ్ హోప్ (6వ ర్యాంక్), విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్ (10వ ర్యాంక్) వన్డేల్లో టాప్-10లోకి వచ్చారు. వెస్టిండీస్‌కే చెందిన అమీర్ జంగూ 55 స్థానాలు ఎగబాకి 55వ ర్యాంకు సాధించాడు. ఆసియా క్రీడల్లో రాణించిన పాకిస్థాన్ ఆటగాడు హసన్ నవాజ్ 62 స్థానాలు మెరుగుపరుచుకుని 48వ ర్యాంకులో నిలిచాడు

# అగార్కర్ వల్లే భువీ కంబ్యాక్ ఆగిపోయిందా?



టీమిండియా స్వింగ్ సుల్తాన్ భువనేశ్వర్ కుమార్ దాదాపు నాలుగేళ్ల తర్వాత మళ్లీ భారత జట్టులోకి రీఎంట్రీ ఇవ్వడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. న్యూజిలాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ఎంపిక చేసిన జట్టులో భువికి చోటు దక్కడం అభిమానులకు ఊరటనిచ్చింది. అయితే ఇన్నాళ్లూ ఆయనను జట్టులోకి తీసుకోకపోవడానికి మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కరే ప్రధాన కారణమంటూ ఒక దిగ్భ్రాంతికర కథనం వెలుగులోకి వచ్చింది. అగార్కర్ పదవీ కాలం ముగియడం, ప్రజ్ఞాన్ ఓజా నేతృత్వంలోని తాత్కాలిక సెలెక్షన్ కమిటీ రావడం వెనువెంటనే జరగడంతో భువి కమ్‌బ్యాక్ సాధ్యమైంది.గత కొంతకాలంగా ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ భువనేశ్వర్ కుమార్‌ను అగార్కర్ సెలెక్షన్ కమిటీ వరుసగా పక్కన పెడుతూ వచ్చింది. భవిష్యత్తు అవసరాల కోసం కేవలం యంగ్ ఫాస్ట్ బౌలర్లను మాత్రమే ప్రోత్సహించాలని అగార్కర్ గట్టిగా భావించడమే దీనికి కారణమని తెలుస్తోంది. కమిటీలోని మాజీ పేసర్ ఆర్‌పీ సింగ్ పలుమార్లు భువీ పేరును ప్రతిపాదించినా, అగార్కర్ మద్దతు లభించకపోవడంతో ఆయన రీఎంట్రీ ఆలస్యమైందని ఆ నివేదిక పేర్కొంది. అజిత్ అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా తప్పుకున్న తర్వాత బీసీసీఐ ప్రజ్ఞాన్ ఓజాను తాత్కాలిక సెలెక్షన్ కమిటీ హెడ్‌గా నియమించింది. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఓజా, భువనేశ్వర్ అనుభవంపై పూర్తి నమ్మకం ఉంచి న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక చేశారు. స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా లేని లోటును భర్తీ చేసేందుకు, అనుభవజ్ఞుడైన భువీ ఉండటం జట్టుకు ఎంతో ప్రయోజనకరమని సెలెక్టర్లు భావించారు. 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్‌లో ఆర్‌సిబి వరుసగా రెండు టైటిళ్లు గెలవడంలో కీలక పాత్ర పోషించారు. భువి రీఎంట్రీ కేవలం పాత పేరు చూసి ఇచ్చినది కాదు. ఐపీఎల్ 2025లో ఆర్‌సిబి తరఫున 14 మ్యాచుల్లో 17 వికెట్లు, 2026 సీజన్‌లో 16 మ్యాచుల్లో ఏకంగా 28 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో సత్తా చాటారు. భారత్ తరఫున ఇప్పటివరకు 87 ు20 మ్యాచ్‌ల్లో 90 వికెట్లు పడగొట్టిన భువనేశ్వర్, కొత్త బంతితో స్వింగ్ చేసే నైపుణ్యంతో మళ్లీ టీమిండియాలో మెరవడానికి సిద్ధమయ్యారు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో యంగ్ టీమ్‌తో కలిసి ఆయన న్యూజిలాండ్ సిరీస్‌లో ఆడనున్నారు. న్యూజిలాండ్ సిరీస్ కోసం శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. జట్టులో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ, అక్షర్ పటేల్, శివం దూబే, నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, భువనేశ్వర్ కుమార్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ స్థానం సంపాదించారు. ఈ యంగ్ అండ్ ఎక్స్‌పీరియన్స్ కాంబినేషన్ సిరీస్‌లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

# చరిత్ర మిమ్మల్ని గుర్తుంచుకుంటుంది

## అగార్కర్‌కు గంభీర్ ఎమోషనల్ మెసేజ్



టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఘనంగా వీడ్కోలు పలికాడు. అగార్కర్ హయాంలో భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు గెలవడాన్ని గుర్తు చేసుకున్న గంభీర్.. భవిష్యత్తులో చరిత్ర అతడిని మరింత గొప్పగా గుర్తుంచుకుంటుందని పేర్కొన్నాడు. “అజిత్ భాయ్.. మీతో కలిసి పనిచేయడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ హయాంలో సాధించిన మూడు ఐసీసీ ట్రోఫీలే మీ నమ్మకానికి నిదర్శనం. ఎప్పుడూ జట్టు ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారు. చరిత్ర మిమ్మల్ని మరింత గొప్పగా గుర్తుంచుకుంటుంది. ధన్యవాదాలు. మీ భవిష్యత్తుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు” అని గంభీర్ ‘ఎక్స్’లో పోస్టు చేశాడు. 2023 జులైలో అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతడి హయాంలో భారత్ 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. ఆ తర్వాత 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచకప్ సాధించింది. వెస్టిండీస్‌తో జరుగుతున్న పరిమిత ఓవర్ల సిరీస్‌కు జట్లను ఎంపిక చేయడం అగార్కర్ చేపట్టిన చివరి బాధ్యతగా నిలిచింది. అగార్కర్ పదవీకాలం మంగళవారంతో అధికారికంగా ముగిసింది. ఖాళీ అయిన సెలెక్టర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రస్తుతం మాజీ భారత స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా తాత్కాలిక చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20లు, భారత్-ఏ జట్టుకు సంబంధించిన మూడు మ్యాచ్‌ల కోసం జట్ల ఎంపికలో అతడు పాల్గొన్నాడు. సెలెక్షన్ ప్యానెల్‌లో ఓజాతో పాటు శివసుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్పీ సింగ్ ఉన్నారు. కొత్త సెలెక్టర్ కోసం అక్టోబర్ 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అభ్యర్థి కనీసం ఏడు టెస్టులు లేదా 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి ఉండాలి. మరో నిబంధన ప్రకారం ఐదు సంవత్సరాల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఉండాలి.



# భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా స్మృతి మంధాన

భారత మహిళ క్రికెట్? జట్టు కెప్టెన్?గా సీనియర్ ఓపెనర్ స్మృతి మంధాన నియమితులయ్యారు. భారత మహిళా క్రికెట్ జట్టు సారథ్యం నుంచి హర్మన్ ప్రీత్ కౌర్ వైదొలిగిన నేపథ్యంలో ఆమె స్థానంలో స్మృతి మంధానను కెప్టెన్‌గా నియమిస్తూ బీసీసీఐ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా స్మృతి మంధానకు బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా శుభాకాంక్షలు తెలిపారు. భారత మహిళ క్రికెట్ జట్టులో అత్యంత అనుభవజ్ఞులైన క్రీడాకారిణుల్లో ఒకరైన మంధాన, 2013 నుంచి జాతీయ జట్టులో సభ్యురాలిగా కొనసాగుతూ ఈ బాధ్యతను చేపట్టారు. ఆమె గతంలో 18టీ20, లు, నాలుగు వన్డేలలో భారత జట్టుకు నాయకత్వం వహించారు. భారత జట్టుకు నాయకత్వం వహించే బాధ్యత తనకు అప్పగించడంపై స్మృతి మంధాన స్పందించారు. ఇది తనకు దక్కిన ప్రత్యేకమైన గౌరవంగా ఆమె పేర్కొన్నారు. తనకు వచ్చిన ఈ అవకాశం ఎంతో విలువైందిగా భావిస్తానని, అలాగే, తనకు మద్దతుగా నిలిచి నమ్మకం ఉంచిన బీసీసీఐ, సెలక్టర్లు, సహచర క్రికెటర్లకు స్మృతి కృతజ్ఞతలు తెలిపారు. భారత మహిళా క్రికెట్? జట్టును మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. అదే సమయంలో గత కొన్నేళ్లుగా సారథ్యం వహించిన హర్మన్ ప్రీత్ సేవలను స్మృతి అభినందించారు.




# భారత క్రికెట్‌కు ‘రో-కో’ ఒక వరం

## పాకిస్థాన్ మాజీ పేసర్ సోహైల్ తన్వీర్

టీమిండియా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం భారత క్రికెట్‌కు దొరికిన ఒక వరం అని పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ సోహైల్ తన్వీర్ ప్రశంసించాడు. వారిద్దరి అపార అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని, రాబోయే 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని వారి సేవలు అత్యంత కీలకమని అభిప్రాయపడ్డాడు. ఇటీవల ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ సోహైల్ తన్వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. “విరాట్ కోహ్లీ గణాంకాలే అతని సత్తా ఏంటో చెబుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు అతను ఎన్నో మధురమైన జ్ఞాపకాలను అందించాడు. కోహ్లీ వీలైనంత ఎక్కువ కాలం ఆడటం భారత క్రికెట్‌కు నిజంగా ఒక వరం” అని ఆయన అన్నాడు. ఇదే విషయాన్ని రోహిత్ శర్మకు కూడా వర్తింపజేస్తూ, వయసును ప్రతికూలంగా చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. 2024 జూన్ లో టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత కోహ్లీ, రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు, 2025 మేలో టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇద్దరూ కేవలం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో తన్వీర్ మాట్లాడుతూ.. “సీనియర్ ఆటగాళ్లకు తమ ఆటను ఎలా నిర్వహించుకోవాలో బాగా తెలుసు. అదే సమయంలో వారు యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేయగలరు. రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్, లయను కాపాడుకోగలిగితే, అతను, కోహ్లీ ఇద్దరూ జట్టులో కొనసాగడం శుభపరిణామం” అని వివరించాడు. 39 ఏళ్ల రోహిత్ శర్మ ఇటీవలి కాలంలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో 92, 101 పరుగులు సాధించాడు. అతను 2027 ప్రపంచకప్‌లో ఆడతాడా? లేదా? అనే చర్చ జరుగుతున్నప్పటికీ, ఫామ్, ఫిట్‌నెస్ ఉన్నంతవరకు వయసుతో సంబంధం లేదని తన్వీర్ నొక్కిచెప్పాడు. అనుభవజ్ఞులైన ఈ ఇద్దరు ఆటగాళ్ల మార్గదర్శకత్వంలో యువ జట్టు రాటుదేలుతుందని అభిప్రాయపడ్డాడు.

Edited & Printed by:Vulloju Srinivas Published & Owned by:Shabari Media House Plot No. 3-421,Journalist Colony,Dammaiguda,Keesara Circle,Medchel Malkajgiri, 500083
RNI NO : TGTEL/25/A4103 Contact : 9848588616 Email : vsrinivasetv@gmail.com